quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

## విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాప్ రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.

తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక www.quicktodaynews.com

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 215 | ఆదివారం, ఏప్రిల్ 28 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## రిజర్వేషన్ల రద్దుకు

# బిజెపి కుట్రలు

- పూర్తి హిందూరాజ్యంగా మార్చే కుయుక్తులు
- దామాషా ప్రకారం రిజర్వేషన్లు మా సిద్ధాంతం
- అందుకే కులగణన చేపట్టాలన్నది కాంగ్రెస్ నిర్ణయం
- 400 సీట్ల లక్ష్యం వెనక రాజ్యాంగం మార్చే కుట్ర
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్



**హైదరాబాద్,ఏప్రిల్27క్విక్ టుడే :** అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ దేశ రాజకీయాలను, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశంపై విస్పష్టంగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. శనివారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగానో.. దౌర్జన్యంగానో.. 400 సీట్లు సాధించి రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణ బద్ధులై ఉన్నారు. ఇందులో భాగంగానే దేశం నలుమూలలా తిరుగుతూ అన్ని రకాల వ్యవస్థలు, సంస్థల్ని ఉపయోగించుకొని ముప్పేట దాడి చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత భాజపాపై .. కాంగ్రెస్ స్పష్టమైన ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రశ్నలకు ఇప్పటి వరకు నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా సమాధానం చెప్పలేదు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు విరుద్ధంగా వారు వ్యవహరిస్తున్నారుని రేవంత్ మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద విధానాన్ని అమలు చేయాలని వారిద్దరూ ప్రయత్నిస్తున్నారు. వివిధ కులాలు, వర్గాలు ఉంటే హిందువులు ఏకతాటి మీదకురారు అనేది భాజపా కుట్ర. రిజర్వేషన్లు రద్దు చేస్తే.. వేర్వేరు కులాలు, వర్గాల ప్రస్తావన లేకుండా పోతుందనేది ఆ పార్టీ ఆలోచన. వచ్చే ఏడాదికి ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు అవుతుంది. 2025 నాటికి రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అందుకే 400 సీట్లలో గెలిపించాలని మోదీ పదే పదే కోరుతున్నారు. భారత్‌ను రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రిజర్వేషన్ల రద్దుపై భాజపా, భారాస ఒకే విధానంతో ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. మల్కాజిగిరిలో భాజపాను గెలిపిస్తామని నిన్న భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆయనపై కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈటలను కేటీఆర్ ఎందుకు విమర్శించడం లేదని ప్రశ్నించారు. ఐదు నియోజకవర్గాల్లో భాజపాకు భారాస మద్దతు ఇస్తోందని నేను చెబుతూనే ఉన్నా. అది నిజమని నిన్న మల్లారెడ్డి మాటలతో స్పష్టమైంది. పదేళ్లపాటు కేసీఆర్ భూములు అమ్ముతుంటే ఈటల

మిగతా 2లో...

## మా పథకాలు అమలు చేయకుండా

# చతికిల

- ఉద్యమం చేసి తెలంగాణను కాపాడాం
- అభివృద్ధి పథకాలతో ముందుకు తీసుకుని వెళ్లాం
- నాగర్‌కర్నూలు ప్రచారంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్




**నాగర్‌కర్నూల్,క్విక్ టుడే :** బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిలదీశారు. కొత్తగా గడ్డపార పట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? గత ప్రభుత్వంలో అమలైన పథకాలను అమలు చేయొచ్చు కదా..? అని అడిగారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఇవాళ గొప్పదినం. తెలంగాణ పార్టీ పుట్టిన దినం. 23 ఏండ్ల క్రితం తెలంగాణ సాధించాలని ఆనాడు పిడికెడు మందితో, గుండె ధైర్యం తెచ్చుకుని ఏపీ నుంచి బయటపడాలని ఉక్కు సంకల్పంతో యుద్ధం ప్రారంభించాం. పెరిగాం. మహాసముద్రం అయ్యాం. ఉప్పెనలా ఉద్యమం నడిపాం. ఆ క్రమంలో చాలా సార్లు నాగర్‌కర్నూల్ వచ్చాను. పార్టీకి 14 ఏండ్లు పూర్తయ్యే సమయంలో ఆమరణ దీక్షకు పూనుకుని కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో తేలాలని ఆనాడు దీక్షకు పోతే ఖమ్మం జైల్లో వేశారు. మీరంతా ఉప్పెనలా ఉద్యమించారు. చివరకు కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం. తెచ్చుకున్న తెలంగాణలో పాలమూరు నా గుండెల్లో ఉంటది.

మిగతా 2లో...



## సోషల్ మీడియాలోకి కెసిఆర్

## తింటుంటే రెండుసార్లు కరెంట్ పోయిందని ట్వీట్

**హైదరాబాద్,క్విక్ టుడే :** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోషల్ మీడియాలోకి ప్రవేశించారు. శనివారమే ఎక్స్ ఖాతా తెరిచిన కేసీఆర్.. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. మహబూబ్ నగర్ పర్యటనలో ఉన్న కేసీఆర్ కరెంట్ కోతలపై ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండుసార్లు కరెంటు పోయింది.

## దేశంలో ఉగ్రవాదం

# తుదముట్టించాలి

- మూడోసారి మోడీనే గెలిపించాలి
- పోరుబందర్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పిలుపు



**పోరుబందర్,క్విక్ టుడే :** వరుసగా మూడోసారి నరేంద్ర మోదీని భారత ప్రధానిని చేయాలని దేశ ప్రజలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. శనివారం పోర్ బందరులో బీజేపీ అభ్యర్థి మనుశుక్ మాండవ్యాకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ అవకాశం ఇస్తే.. ఆయన దేశంలో నక్సలిజానికి, ఉగ్రవాదానికి చరమగీతం పాడతారన్నారు. అయితే కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని బీజేపీ రద్దు చేసిందని.. అయితే ఆ ఆర్టికల్ రద్దును కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారని అమిత్ షా ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాశ్మీర్‌లో రక్త ప్రవాహం కోసమే రాహుల్ ఈ విధంగా వ్యవహరించారని అమిత్ షా ఆరోపించారు.

మిగతా 2లో...

# కెసిఆర్ కరెంట్ కోతలు ఉత్తిదే

- ట్వీట్‌పై సిఎం రేవంత్ స్పందన
- విచారణకు ఆదేశించడంతో బయటపడ్డ నిజాలు
- ఎక్కడా కోతలు లేవని తేల్చిన విద్యుత్ అధికారులు



**హైదరాబాద్,క్విక్ టుడే :** కెసిఆర్ కరెంట్ కోతలపై చేసిన ట్వీట్ ఉత్తిదే అని తేలిపోయింది. కెటిఆర్ ట్వీట్‌పై స్పందించిన సిఎం రేవంత్ ఆదేశాలతో విద్యుత్ అధికారు లు రికార్డులు తనిఖీలు చేశారు. మహబూబ్‌నగర్‌లో మాజీమంత్రి శ్రీనివాసరెడ్డి ఇంటివద్ద ఎలాంటి కట్స్ లేకుండా విద్యుత్ సరఫరా అయినట్లు రికార్డుల్లో తేలింది. తెలంగాణలో పవర్ కట్స్ అంటూ బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ చేసిన ట్వీట్.రాజకీయదుమారం రేపింది. నిన్న మహబూబ్ నగర్ లోని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండుసార్లు కరెంట్ పోయిందని ట్విట్టర్ లో కేసీఆర్ చెప్పారు. రోజుకు పదిసార్లు కరెంట్ పోతుందని తనతో ఎమ్మెల్యేలు చెప్పినట్లు చెప్పారు. రాష్ట్రంలో చాలా విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయని కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని ట్వీట్ చేశారు కేసీఆర్.అయితే కేసీఆర్ ట్వీట్ పై స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. విచారణకు వెంటనే ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన మహబూబ్ నగర్ విద్యుత్ అధికారులు.. ఎలాంటి పవర్ కట్స్ లేవని తేల్చి చెప్పారు.

మిగతా 2లో...

## మారిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

# పరీక్షల తేదీలు



**హైదరాబాద్,క్విక్ టుడే :** తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో మార్పులు చేసింది ఇంటర్ బోర్డు. ముందుగా మే 24 నుండి జూన్ 1 వరకు ఉన్న పరీక్షల తేదీలను.. మే 24 నుండి జూన్3 వరకు పరీక్షల తేదీలను మార్చింది బోర్డు. మే 27న నల్లగొండ?ఖమ్మం?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉన్న నేపథ్యంలో ఈ మార్పులు చేసినట్లుగా తెలుస్తుంది.

మిగతా 2లో...



## ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం

### తెలంగాణ భవన్‌లో పార్టీ జెండా ఆవిష్కరణలో కెటిఆర్

**హైదరాబాద్,క్విక్ టుడే :** విజయాలకు పొంగిపోము, అపజయాలకు కృంగిపోమ నేలా తమ ప్రస్థానం సాగుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం మాట్లాడుతూనే ఉంటాం.. కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణకు ఒక గొంతుక ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అన్న జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ

మిగతా 2లో...



## కాళేశ్వరంపై విచారణకు

# పిలిస్తే తప్పేముంది

- వివరాలు తెలుసుకోవాలంటే చెబుతారు - కొన్ని విషయాల్లో మోడీని నమ్మి మోసపోయాం
- అనవసరంగా నోట్ల రద్దుకు మద్దతు ఇచ్చాం - బిఆర్ఎస్ 8నుంచి 9 సీట్లు సాధిస్తుంది
- మీడియాతో చిట్‌చాట్‌లో కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్,క్విక్ టుడే :** కాళేశ్వరంపై విచారణకు మాజీ సీఎం కేసీఆర్ ను పిలిస్తే తప్పులేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వెంటనే మాజీ ముఖ్యమంత్రి నుంచి తెలుసుకోవాలనుకోవడం తప్పులేదంటూ చమత్కరించారు. తాము కేంద్రంలోని బీజేపీ సర్కారుకు అంశాల వారీగానే మద్దతు ఇచ్చామని అన్నారు. ప్రధాని మోదీ మాట నమ్మి నోట్ల రద్దుకు సహకరించామని చెప్పారు. తర్వాత చెంపలేసుకున్నామని అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్ లో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. కడియం శ్రీహరి పార్టీ కి ద్రోహం చేశారని పేర్కొన్నారు. ఆయన వరంగల్ ప్రజలను వంచించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీవి ఉ÷-దదెర పథకాలని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని అన్నారు.

మిగతా 2లో...

(మొదటి పేజీ తరువాయి)

## మా పథకాలు అమలు చేయకుండా చతికిల

ఈ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించుకున్నాం. ఆ గౌరవం చరిత్రలో మహబూబ్‌నగర్‌కు ఉంటది అని కేసీఆర్ తెలిపారు. కులం, జాతి, మతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను కోడి పిల్లలను సాదుకున్నట్టు పదేండ్లు గులాబీ జెండా కింద సాదుకుని, బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నాం. 50 ఏండ్లు కాంగ్రెస్, టీడీపీ పాలన ఉంటే పాత మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజైనా వచ్చిందా..? ఇవాళ ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి బీఆర్ఎస్ రాజ్యంలో. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి తండ్రి చనిపోయినప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు పిలిపించుకుని బస్సులో గద్వాలకు ప్రయాణించాను. వలసలు పోయినా పాలమూరు ఎట్లుందో చూడాలని 200 కి.మీ. బస్సులో వెళ్లాను. చాలా ఆనందం, సంతోష పడ్డాను. వరికోతలు, ధాన్యపు రాశులు చూస్తే ఆనందం కలిగింది. నా పాలమూరు ఇంత బాగైందని సంతోష పడ్డాను అని కేసీఆర్ పేర్కొన్నారు. మొన్న అడ్డగోలు హామిలిచ్చి దుష్ప్రచారాలు చేసి కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రైతుబంధు అందరికీ వచ్చిందా..? ప్రతి ఆడబిడ్డకు రూ. 2500 వచ్చాయా.? రుణమాఫీ అయిందా..? తులం బంగారం వచ్చిందా..? అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా..? వరికి రూ. 500 బోనస్ వచ్చిందా..? చివరికి వస్తే ఎండింది ఎండంగ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పెడితే కొనే దిక్కు లేదు. వానలకు తడిసిపోతుంది తప్ప కొనే దిక్కు లేదు. ఈ ప్రభుత్వం పరిస్థితి ఇది. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఒక్క ఏడాదిలోనే కరెంట్ 24 గంటలు ఇచ్చాం. రెప్పపాటు కరెంట్ పోలేదు. కాంగ్రెస్ రాజ్యంలో కరెంట్ పోతుంది. బావుల కాడ తేళ్లు, పాములు కడుతున్నాయి. ఇప్పటి వరకు 225 మంది రైతులు చనిపోయారు. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు కరెంట్ షాకులతో, పాములు కరవడంతో చనిపోయారు. ఈ బాధ ఎందుకు వచ్చిందో ఆలోచన చేయండి. కేసీఆర్ పెట్టిన పథకాలు ఇవ్వాలి కదా.. కొత్తగా గడ్డపార పెట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? అని కేసీఆర్ ప్రశ్నించారు. సీఎం, మంత్రులు 24 గంటల కరెంట్ ఇస్తున్నాం అంటున్నారు. కానీ రోజుకు పది సార్లు పోతుంది. ఇవాళ శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో అన్నం తింటుంటే కరెంట్ పోయింది. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని తీసేశారా అని అడిగాను. ఒక్కసారి కాదు.. రోజుకు పదిసార్లు పోతుందని చెప్పారు. ఇది కాంగ్రెస్ పరిపాలన.. మీరంతా కళ్లారా చూస్తున్నారు. బ్రహ్మాండంగా మిషన్ భగరీథతో ఇంటింటికి నీళ్లు అందించాం. ఇప్పుడు బోర్లు ఎందుకు వేస్తున్నారు..? నీళ్ల ట్యాంకర్లు ఎందుకు వస్తున్నాయి.? బిందెలతో ఆడబిడ్డలు కనిపిస్తున్నారు అని కేసీఆర్ తెలిపారు. మళ్లీ మన ప్రభుత్వమే వస్తది.. ఇందులో ఏం అనుమానం లేదు.. రంది పడాల్సిన అసవరం లేదని కేసీఆర్ తేల్చిచెప్పారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బలుపును దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. ఇవాళ ఈ రాష్ట్రం ముఖ్యమంత్రి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు. కేసీఆర్.. నీ గుడ్లు పీకి గోటీలు అడుకుంటా. నీ పేగులు తీసి మెడలు వేసుకుంటా. ఆఖరికి వస్తే నీ ముడ్డి మీద చెడ్డి కూడా గుంజుకుంటా.. ఇది సీఎం మాట్లాడే భాషేనా..? ఇది ధర్మమేనా..? తెలంగాణ సాధించిన వ్యక్తిని, ఇన్నేండ్లు పోరాటం చేసిన వ్యక్తిని, వచ్చిన తెలంగాణను తెల్లగా చేసిన వ్యక్తిని, మంచినీళ్లు, సాగు నీళ్లు, కరెంట్ కోసం తండ్లాడిన వ్యక్తిని.. నన్ను ప్టటుకుని ఇన్ని మాటలు అనొచ్చానా..? ఇది ధర్మమేనా..?ఇదా మన తెలంగాణ గౌరవమా..? అని కేసీఆర్ నిలదీశారు. మీరే న్యాయం, ధర్మం చెప్పండి.. కర్రు కాల్చి వాత పెట్టండి.. ఎవరిని అందలం ఎక్కించాలో నిర్ణయించేది మీరే.. ఆ శక్తి ఉన్నది మీ దగ్గర.

ధర్మాన్ని గెలిపించండి.. బీఆర్ఎస్ గెలిపించండి. మళ్లా మన గవర్నమెంటే వస్తుంది.. ఇది గ్యారెంటీ. ఎక్కడ పోయినా నా బస్సును కదలనివ్వడం లేదు. కచ్చితంగా జనం మారిపోయారు.. అర్థమైపోయింది. ఈ ప్రభుత్వానికి చురక పెట్టాలని, బలుపు దించాలని ప్రజలు ఉన్నారు. ఏం అనుమానం లేదు మన ప్రభుత్వమే వస్తుంది. అన్ని బ్రహ్మాండంగా చేసుకుందాం. రంది పడాల్సిన అవసరం లేదు అని కేసీఆర్ పేర్కొన్నారు. కెసిఆర్ వెంట ఎంపి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీమంత్రి నాగం జనార్థన్ రెడ్డిలు ఉన్నారు.

## దేశంలో ఉగ్రవాదం తుదముట్టించాలి

గత అయిదేళ్లలో కాశ్మీర్‌లో ఒక్క రక్తపాత ఘటన కూడా చోటు చేసుకోలేదని అమిత్ షా ఈ సందర్భంగా ఉదాహరించారు. అలాగే దేశంలో ఉగ్రవాదం, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ పని చేస్తున్నారనీ వివరించారు. అలాగే ప్రదానిగా మన్మోహన్ సింగ్ ఉన్నప్పుడు దేశంలో ఎలా ఉంది, మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఓ సారి ఆలోచించాలని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు. ఇక భారత్‌లో పుల్వామా, యూరీ ఘటనలకు పాక్ దుశ్చర్యలకు పాల్పడితే.. భారత్ మాత్రం సర్జికల్ స్టైక్స్ ద్వారా ఆ దేశానికి జవాబు ఇచ్చిందని ఈ సందర్భంగా అమిత్ షా గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ పాలనలో భారత్ ఆర్థిక పరిస్థితి 11వ స్థానంలో ఉండేదని.. కానీ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ ఆర్థిక పరిస్థితి 5వ స్థానానికి ఎగబాకిందన్నారు. అదీ కూడా కేవలం 10 ఏళ్లలోనే అని అమిత్ షా గుర్తు చేశారు. ప్రధానిగా మోదీకి మరో అవకాశం ఇస్తే.. భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద శక్తిగా ఆవతరింప చేస్తారని.. అందుకు తాను గ్యారంటీ అని అమిత్ షా స్పష్టం చేశారు.

## ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం

వాస్తవంగా నిలుస్తాయన్నారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో ఉన్న శూన్యం లాంటి వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్‌ను కేసీఆర్ ఏర్పాటు చేశారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం దేశంలోని అనేక రాష్ట్రాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఒక దిక్సూచిగా, ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సహకారంతోనే రాష్ట్రం సహకారమయిందని, పార్టీ తరఫున ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమన్నారు. సమైక్యవాద శక్తుల కుట్రలను ఛేదించి తెలంగాణ ప్రజల గొంతుకను అన్ని చట్టసభల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వినిపించిందని చెప్పారు. సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దే అని 2014లో తమ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు, అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఒక సదుద్దేశంతో పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు అద్భుతమైన స్పందన లభించిందని వెల్లడించారు. అయితే దురదృష్టవశాత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాలేదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన ఏ పనినైనా వదలకుండా ముందుకు తీసుకుపోయిన చరిత్ర గత రెండున్నర దశాబ్దాలలో ప్రజలందరికీ తెలుసన్నారు. బోధించు, సమీకరించి, పోరాడు అనే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఒంటపట్టించుకుని ముందుకు నడుస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరికీ, తమకు మద్దతుగా నిలబడిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల కోసం, వారి ఆకాంక్షల కోసం పోరాడిన గులాబీ దండుకు, ప్రాణాలు అర్పించి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిస్తున్న బాటలో మరోసారి పూనరంకితం అవుతామని స్పష్టం చేశారు.

## మారిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలు

ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు ఒకే రోజున నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్ట్ ఈయర్ ఎగ్జామ్స్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు ఇంటర్ సెకండ్ ఈయర్ పరీక్షలు నిర్వహించనున్నట్లుగా ఇంటర్ బోర్డు తెలిపింది. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఇటీవలే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో టాప్ లోనిలవగా..సెకండియర్ రిజల్ట్ లో ములుగు జిల్లా అత్యధిక ఉత్తీర్ణతతో ఫస్ట్ ప్లేసులో నిలిచింది. ఫస్ట్ ఇయర్‌లో 60.01 శాతం ,సెకండియర్ లో 64.19 శాతం ఉత్తీర్ణత సాధించారు.

## కెసిఆర్ కరెంట్ కోతలు ఉత్తిదే

శ్రీనివాస్ గౌడ్ నివాసముంటున్న ప్రాంతంలో చెక్ చేశామని.. విద్యుత్ సబ్ స్టేషన్లో కూడా రికార్డులను చెక్ చేశామన్నారు. ఎలాంటి పవర్ కట్స్ లేవని విద్యుత్ అధికారులు స్పష్టం చేశారు. లేనిపోని అబద్దాలతో కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. మొన్న సూర్యాపేటలో కరెంట్ పోయిందని అబద్ధం చెప్పారు. ఇవ్వాళ మహబూబ్‌నగర్‌లోనూ ఇప్పుడు అవే అబద్దాలు చెప్పారని ఫైరయ్యారు. కేసీఆర్‌కు మరీ ఇంత అధికార దాహం ఎందుకని ప్రశ్నించారు. ఓడిన తర్వాత కూడా ఆయనకు ఇంకా గర్వం తగ్గలేదన్నారు.

## కాళేశ్వరంపై విచారణకు పిలిస్తే తప్పేముంది

ఈ లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీ 8 నుంచి 9 సీట్లలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొంచం గట్టిగా ప్రయత్నిస్తే 12 సీట్లు గెలుస్తామని కేటీఆర్ చెప్పారు. ఓట్లు వేయకుంటే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎత్తేస్తానని సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చాలా తెలివైనోడని, కావాలనే ఈటలను మునగ చెట్టు ఎక్కించారని అన్నారు. ఈటల రాజేందర్ ను ఇప్పటి వరకు రెండు సార్లు ఓడించామని, మూడో సారి కూడా ఓడిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు ఓడిపోతున్నామని అర్థమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీవన్నీ ఉ÷-దదెర పథకాలని అన్నారు. కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ లీడర్ల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. వాళ్లు మళ్లీ వస్తామన్నా తమ పార్టీలోకి రానివ్వబోమని చెప్పారు. ఏపీలో తమకున్న సమాచారం మేరకు వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతున్నదని అన్నారు. హరీశ్ రావు రాజీనామా సవాల్ పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని అన్నారు. ఒట్లు ప్రమాణాలు కాదని సవాల్ ను స్వీకరించాలని అన్నారు. దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌కు రేవంత్ రెడ్డి స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో గెలవడం కూడా కష్టమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిది మాట నిలుపుకున్న చరిత్ర కాదు.. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నాడు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా గెలుస్తామని చెప్పి ఓడిపోయిన తర్వాత మాట తప్పాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోసం పార్ట్–1 జరిగింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోసం పార్ట్ –2 కొనసాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి రుణమాఫీ చేయడు. నేతి బీరకాయలో నెయ్యి ఉండని తీరుగానే రేవంత్ రెడ్డి మాటల్లో నిజాయితీ ఉండదు. ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన పార్టీకే రేవంత్ రెడ్డి కట్టుబడి లేడు. ఆయన ఏ సవాల్‌కు కట్టుబడి ఉన్నాడో చెప్పాలె అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మాకు రాజకీయ ప్రత్యర్థులే. ఈ రెండు పార్టీలు చేసిన ద్రోహానికి దేశానికి ఎంతో నష్టం జరిగింది. అందుకే కాంగ్రెస్, బీజేపీలను తిరస్కరించి ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదు బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది. బీజేపీని ఎదుర్కొనే శక్తి లేకనే రాహుల్ గాంధీ ఉత్తర భారతదేశం నుంచి కేరళకు పారిపోయిండు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఒత్తిడి చేసిన ఎదుర్కొని బీజేపీని తట్టుకుంటున్నది ప్రాంతీయ శక్తులే. ఒకనాడు ఎన్టీ రామారావు భారతదేశం అనే పార్టీ పెట్టాలనుకున్నాడు. కానీ ఆయన శిష్యుడు కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టాడు. ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అయినా విస్తరించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రస్తుతానికి తెలంగాణలో పూర్వ వైభవం సంతరించుకోవటానికి కష్టపడుతున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్రలు

రాజేందర్ ఎప్పుడైనా మాట్లాడారా? నేను రుణమాఫీ చేస్తాను అనగానే భూములు అమ్మవద్దని ఈటల కండీషన్లు పెడతున్నారని మండిపడ్డారు. 'మోదీ, అమిత్ షా అన్ని వ్యవస్థలను వాడుకుంటున్నారు. దేశ జనాభా ఆధారంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు నిర్ణయించింది. ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు రిజర్వేషన్లను వ్యతిరేకించాయి. రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర బీజేపీ చేస్తోందని, అయితే రాహుల్ గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌ను పూర్తి హిందూదేశంగా మార్చబోతున్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చబోతున్నారు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై బీజేపీ సర్జికల్ స్టైక్ర్ చేస్తుంది. రాహుల్ గాంధీపై మోదీ, అమిత్ షా అసత్య ఆరోపణలు చేస్తున్నారు. తాళి పుస్తెలు గుంజుకుంటారని మోదీ లాంటి వారు ప్రచారం చేస్తున్నారు. భార్య ఆస్తి పై భర్తకు హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.. ఇలాంటి సమయంలో ఆస్తులు గుంజుకుంటారని ఆరోపణలు చేస్తున్నారు. ఆర్ఎస్ ఎస్ విధానాలను బీజేపీ అమలు చేస్తుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ విధానాన్ని మోదీ,అమిత్ షా అమలు చేస్తున్నారు. రిజర్వేషన్ల రద్దుపై బీజేపీ అధిష్టానం ఎందుకు మౌనంగా ఉంటుంది. జనాభా లెక్కలు జరిగితేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యం అవుతుంది.. అందుకే జనాభా లెక్కలు బీజేపీ ప్రభుత్వం చేయడం లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి, ఈటల ఎందుకు మాట్లాడడం లేదు.. అన్ని విషయాలు మాట్లాడుతున్న కేసీఆర్ ఈ విషయం గురించి ఎందుకు స్పందించడం లేదు?. రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ తన విధానాన్ని ప్రకటించాలి. వంద రోజులకే మమ్మల్ని దిగిపోవాలని అంటున్న కేసీఆర్.. పదేళ్ల బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు అనడం లేదని అన్నారు.










జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము

అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

## హయత్‌నగర్ సీఐ రామకృష్ణను అభినందించిన సీపీ



**హైదరాబాద్, క్విక్ టుడే న్యూస్ :** రాచకొండ కమిషనర్ శ్రీ తరుణ్ జోషి ఐపీఎస్ గారు ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో తీసుకుంటున్న చర్యలలో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి విధులలో సమర్ధవంతంగా పనిచేస్తున్న హయత్ నగర్ పోలీస్ స్టేషన్ హౌజ్ అధికారి జి రామకృష్ణను నెరెడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో అభినందించి రివార్డ్ అందించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరింత సమర్ధవంతంగా పని చేయాలని సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రామ రాజేష్ ఖన్నా



**రాయపర్తి, 27ఏప్రిల్ 2024 క్విక్ టుడే** : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం లోని బాలాజీ తండా లో శనివారం అజ్మీర విజయ్ – మౌనిక రిసెప్షన్ వేడుకలో ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్ మరియు నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు గిఫ్ట్ అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నూకల అంజయ్య, వైస్ ప్రెసిడెంట్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన్ రావు దశదినకర్మలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి





**నల్లగొండ జిల్లా ప్రతినిధి.ఏప్రిల్ 27. (క్విక్ టుడే ) :**రోడ్డు ప్రమాదంలో మరణించిన పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శిసంధినేని జనార్ధన్ రావు దశదినకర్మలో.. మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్, శాసన మండల సభ్యులు ఎంసీ కోటిరెడ్డి,నల్లగొండ టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహ రెడ్డి,రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, రామచంద్రనాయక్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, మాలే శరణ్య రెడ్డి,నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్..వంగాల సహదేవరెడ్డి బకరం వెంకన్న,పార్టీ అధ్యక్షులు, భువనగిరి దేవేందర్ దేప వెంకట్ రెడ్డి అయిత గోని యాదయ్య తదితరులు వెంట ఉన్నారు.

## పౌరుడి చేతిలో బ్రహ్మాస్త్రం సి విజిల్

### సి.విజిల్ ఆప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనల ఫిర్యాదులు



**నల్లగొండ జిల్లా ప్రతినిధి.ఏప్రిల్ 27. (క్విక్ టుడే ) :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంబంధించిన పిర్యాదులు వెంటనే సి-విజిల్ యాప్ లో ద్వారా ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎస్పి చందన దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినచో ప్రజలు సి-విజిల్ యాప్ లో ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. బాధ్యతాయుత పౌరుని చేతిలో బ్రహ్మాసం సి-విజిల్ యాప్ అని, ఇందులో ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, నగదు, వస్తువులు, మద్యం ద్రవ్యాలు పంపిణీ చేయడం, ప్రజల ఆస్తులను అనుమతి లేకుండా ప్రచారాలకు వినియోగించడం, కుల మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ఓటర్లను రవాణా, అసత్య వార్తల ప్రసారం, చెల్లింపు వార్తలు ప్రచురణ, మారణాయుధాలు కలిగి ఉండడం, ఇతర ఎన్నికలకు సంబందించిన ఫిర్యాదులను చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన ఫోటోలు, వీడియో లను వెంటనే సి-విజిల్ లో అప్లోడ్ చేయడంతో నిర్ణీత కాల వ్యవధిలో ప్లైయింగ్ స్క్వాడ్ టీం ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## పీర్జాదిగూడలో ఘనంగా

# బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబురాలు



**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :**బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీశ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిధిలుగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ పార్టీ జెండా ఆవిష్కరించి గులాబీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా 1,6,7,13,14,19 డివిజన్లలో జరిగిన జెండా ఆవిష్కరణ వేడుకలో పాల్గొని అనంతరం పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 27, 2001 నాడు తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పుట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పార్టీ అహర్నిశలు కృషి చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి, భారత రాష్ట్ర సమితిగా పరిణతి చెంది రైతుల కోసం, శ్రామికుల కోసం, కర్షకుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం, పేద వర్గాల కోసం, వారి అభివృద్ధి కోసం.. పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపి పార్టీలు అమలు కానీ హామీలను ప్రచారం చేసి ప్రజలకు మోసంచేస్తున్నాయని దుయ్యపట్టారు. రైతు భరోసా ఎకరాకు రూ. 15వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు, వరి పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్, 18 ఏళ్ళు దాటిన మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఇయ్యలేదు. ఆసరా పెన్షన్ రూ.



4000 కు పెంచుతామన్నారు. దొంగ హామీలు ఇచ్చి మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపి పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, ఏనుగు మనోరంజన్ రెడ్డి,బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్,జగన్, వెంకన్న,మల్లం వెంకటేష్ గౌడ్,జిలాని పాషా, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, ఉద్యమ కారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఏవీఎం స్కూల్ యజమాన్యం 10 లక్షల పరిహారం ఇవ్వాలి



### కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్

**నల్లగొండజిల్లా ప్రతినిధి.ఏప్రిల్ 27. ()క్విక్ టుడే) :** నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం విద్యా సంస్థలలో టీచర్ గా పని చేస్తున్న బోడ ఆశ్రిత వడదెబ్బతో మృతి చెందిందని, ఏబీఎన్ విద్యా సంస్థల యాజమాన్యం నకిరేకల్ వారు 10 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని కెవిపిఎస్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలన నాగార్జున డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా అడ్మిషన్స్ కోసం ఎండలో సైతం క్యాంపెయిన్ చేస్తూ అస్వస్థకు గురైన ఆశ్రిత ప్రాణాలు కోల్పోయారన్నారు.క్యాంపెయిన్ అనంతరం ఇంటికి వచ్చి తీవ్ర జ్వరంతో మృతి చెందినట్లు సమాచారం అదిందనే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## చట్టపరమైన భద్రత లేకనే బీసీ సామాజిక వర్గాలపై దాడులు



**నల్లగొండజిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17.(క్విక్ టుడే ) :** చట్టపరమైన భద్రత లేని కారణంచేత బీసీ సామాజిక వర్గాల పై నిత్యం దాడులు జరుగుతున్నాయని నల్గొండ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థులు పాలకూరి రవి పాలకూరి రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ పార్లమెంటు నుండి బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నల్గొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్న అభ్యర్థులు మాట్లాడుతూ..బీసీ సామాజిక వర్గాలకు చట్టపరమైన భద్రత లేని కారణం చేత కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఇలాంటి భౌతిక దాడులను అరికట్టాలంటే బీసీ సామాజిక వర్గాలలో చైతన్యం రావాలని మన ఓటు మనం వేసుకుంటేనే పార్లమెంట్లో మన గొంతు వినిపిస్తుందని నల్గొండ పార్లమెంటు నుండి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో న నిలబడడం జరిగిందని అన్నారు. వివిధ రాజకీయ పార్టీలలో పనిచేస్తున్నటువంటి బీసీ సామాజిక వర్గాలను జెండాలు మోయిస్తూ తమ దగ్గర బానిసల్లాగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..ప్రశ్నించినటువంటి కార్యకర్తలపై కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి గడగోజు విజయ్, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దొరేపల్లి హరిశంకర్, పట్టణ అధ్యక్షులు బత్తుల శ్రీశైలం యాదవ్,మాదగోని శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక గర్జన ప్రజ ఆశీర్వాద సభకు తరలిన యవత



**చెన్నూర్, ఏప్రిల్ 27.క్విక్ టుడే న్యూస్ :** జైపూర్ మండల్ యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున హాజరై యూత్ కాంగ్రెస్ నేషనల్ అధ్యక్షులు శ్రీనివాసరావు మరియు యువజన నాయకుడు రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి గారికి జిల్లా అధ్యక్షులు తాళ్ల సంపత్ రెడ్డి మరియు సట్ల సంపత్ గంగాధరి రాజన్న ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువత స్వాగతం పలుకుతూ నస్పూర్ లో జరిగే సభకు హాజరవుతున్నారు దీనికి పెద్ద ఎత్తున యువత హాజరు కావడం జరిగినది.

## చెన్నూర్ లో బిఆర్ఎస్ పార్టీకి షాక్

### కాంగ్రెస్ లో చేరిన 100 మంది నాయకులు





**చెన్నూర్, ఏప్రిల్ 27. క్విక్ టుడే న్యూస్:** చెన్నూర్ మండలంలోని ఆదర్శనగర్ లో కార్నర్ మీటింగ్ పెట్టి నిర్వహించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ విజయం కోసం కాంగ్రెస్స్ పార్టీ ఇస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల కు ఆకర్షితులు అయ్యి చెన్నూర్ పట్టణం కు చెందిన బి.అర్. స్.నాయకులు అట్టెం రాజబాబు మాజీ వార్డ్ మెంబర్, కోమటిపల్లి రమేష్, బొమ్మ శ్రీనివాస్ రెడ్డి, భీమినీ వెంకట స్వామి గౌడ్, అద్దూరి బుచ్చయ్య, రామచందర్, చల్ల చంద్రారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, నాయకపు వినయ్, గుండేటీ మధు మొదలైన వారిని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గారు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని ప్రజలు విశ్వసించారు కావున రాష్ట్రంలో అధికారంలోకి రావడం జరిగింది అని అన్నారు. నేను పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు తెలంగాణ కోసం పోరాటం చేయడం జరిగిందని అలానే చెన్నూర్ నియోజకవర్గం జైపూర్ లో పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం కృషి చేశానని, రామగుండంలో ఎరువుల కర్మాగారాన్ని పున ప్రారంభించడం కోసం కేంద్ర ప్రభుత్వమే ఒత్తిడి తెచ్చానని దాని ఫలితంగా ఈరోజు ఎరువుల కర్మాగారం పనిచేస్తుందని అన్నారు. రానున్న కాలంలో గడ్డం వంశీకృష్ణ గారు పెద్దపల్లి నియోజకవర్గానికి ఎంపీగా గెలుపొందితే ఇండస్ట్రియల్ కారిడారుగా ఎంతో అభివృద్ధి చేస్తానని అలానే నియోజకవర్గంలో మంచినీరు సమస్య లేకుండా చేస్తానని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.చెన్నూర్ నియోజకవర్గంలో మీరు చూపిన ప్రేమ ఆప్యాయత వలన నాకు అత్యధిక మెజారిటీగా గెలిపించరు అని అలానే మీ ప్రేమ ఆప్యాయతలు గడ్డం వంశీకృష్ణ మీద ఉండాలని పెద్దపెల్లి నియోజకవర్గం అభివృద్ధి లో మీరు కూడా భాగస్వామ్యం ఉండాలని ప్రజలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణ సతీష్, మాది జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, చెన్నూర్ టౌన్ ప్రెసిడెంట్ చేన్న సూర్యనారాయణ, చెన్నూరు మండల అధ్యక్షుడు ముత్యాల బాప గౌడ్, చీర్లా సుధాకర్ రెడ్డి, గుడిసెల బాపిరెడ్డి, గజ్జల అంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 30న కొత్తగూడెంలో కేసీఆర్ కార్నర్ రోడ్ షో

### బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు



పినపాక, ఏప్రిల్ 27, క్విక్ టుడే న్యూస్ : బంగారు తెలంగాణ దశ, దిశ కెసిఆర్ తోనే సాధ్య పడుతుందని, ఢిల్లీ లో తెలంగాణ గొంతుక గట్టిగా వినపడాలంటే బి ఆర్ఎస్ ఎంపీ ల సంఖ్య కూడా బలంగా ఉండాలనే క్రమంలో తెలంగాణలో అన్ని పార్లమెంట్ సెగ్మెంట్లలో అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులు కార్యకర్తల పై ఉందని మాజీ ఎమ్మెల్యే బి ఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.తెలంగాణ లో కెసిఆర్ అస్తిత్వ ప్రతీక గా పనిచేసి పదేళ్ల పాటు సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. అయితే మే 13 న మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రంలో లోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో బి ఆర్ ఎస్ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా రాష్ట్రమంతా బస్సు యాత్రలో భాగంగా రోడ్ షో కార్నర్ సమావేశాలను హాజరవుతున్నారని ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాజీ ఎంపీ మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ పర్యటనలో భాగంగా ఈ నెల 30 న మాజీ ముఖ్యమంత్రి, కె సి ఆర్ రోడ్ షో కార్నర్ మీటింగ్ సాయంత్రం నిర్వహిస్తున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని రోడ్ షో కార్నర్ సమావేశం విజయవంతం చేయాలని రేగా కాంతారావు పిలుపునిచ్చారు.

# అసెంబ్లీలో కమ్యూనిస్టుల గళం ఉండాలి

## - గెలిపిస్తే ప్రజల పక్షాన పోరాడుతాం - సెంట్రల్ సిపిఎం అభ్యర్థి సిహెచ్ బాబురావు



**విజయవాడ,ఏప్రిల్27** విజయవాడ నగరం బాగుపడాలంటే అసెంబ్లీలో కమ్యూనిస్టులు ఉండాలని సెంట్రల్ సిపిఎం అభ్యర్థి సిహెచ్ బాబురావు అన్నారు. శనివారం విజయవాడలోని ఎస్ ఆర్ ఆర్ కాలేజీ వాకర్స్ ను కలిసి బాబురావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాబురావు, ఎస్ ఆర్ ఆర్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ ను, క్రీడాకారులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అన్ని వర్గాల పెద్దలు బాబురావుకు మద్దతు పలికారు. సాదరంగా ఆహ్వానించారు. పార్టీలకు అతీతంగా కమ్యూనిస్టుల పోరాటాలను గుర్తించి బాబురావుకే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల తరపున పోరాడే బాబురావును ఎన్నుకోవాల్సిన బాధ్యత నగర ప్రజలందరిపై ఉందని తెలియచెప్పారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రముఖులు మాట్లాడుతూ ..ప్రతి ప్రజా సమస్యల మీద స్పందించే కమ్యూనిస్టులు, బాబురావునిహళగెలిపించాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. విద్యుత్, చెత్త పన్ను, ఇంటి పన్ను, ఇతర భారాలపై నికరంగా పోరాడిన బాబురావు అసెంబ్లీలో ఉంటే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. పార్టీలకు అతీతంగా విజయవాడ నగర అభివృద్ధి కోసం సిపిఎం బాబురావుకు మద్దతు పలకాలన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల సమస్యలపై నిత్యం స్పందించేది బాబురావు మాత్రమేనన్నారు. ఫిరాయింపు రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారనీ ? ఒకే మాట, ఒకే పార్టీకి కట్టుబడిన బాబురావు నిబద్ధతను చూసి ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ?.. శారీరక ఆరోగ్యానికి నడక వ్యాయామం ఎంతో అవసరం అని అన్నారు. మోడీ, జగన్ ప్రభుత్వాలు ప్రజలకు మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నాయని చెప్పారు. దేశ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయన్నారు. ఆర్థిక ఆరోగ్యంగా ఉండాలంటే మోడీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దించాలని పిలుపునిచ్చారు. మోడీతో జతకట్టిన తెలుగుదేశం కూటమికి బుద్ధి చెప్పాలన్నారు. 'అసెంబ్లీలో కమ్యూనిస్టులు ఉండాలి, విజయవాడ నగరం నుండి సిపిఎం గెలవాలి' అని నినదించారు. మోడీ జగన్ ఉమ్మడిగా వేసిన భారాలతో ప్రజలు కఅంగిపోయారని, అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన అసంతఅప్తిలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మోడీకి వ్యతిరేకంగా పోరాడే పార్టీలు కరువయ్యాయన్నారు. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసిపిలు బిజెపి, మోడీకి లొంగిపోవడం సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ బిజెపిని చాలాసార్లు తిరస్కరించారనీ.. ప్రజలు తిరస్కరించిన బిజెపిని, మోడీని మూడోసారి కేంద్రంలో అధికారంలోకి తేవాలని ప్రత్యక్షంగా చంద్రబాబు, పరోక్షంగా జగన్ ప్రయత్నించటం ప్రజాభిష్టానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేది కమ్యూనిస్టులు, ఇండియా కూటమి మాత్రమేనన్నారు. అందుకే ఇండియా వేదిక తరపున సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాబురావును సెంట్రల్ నుండి గెలిపించాలని పిలుపునిచ్చారు. విజయవాడ నగరం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోందని? వైసిపి, తెలుగుదేశం, బిజెపిలు నగర అభివృద్ధిని గాలికి వదిలేసాయని చెప్పారు. ఇప్పటివరకు బైపాస్ రోడ్డు లేదు, సరైన ÷÷-లఓల్ల÷వర్ బ్రిడ్జి లేదు, అసంపూర్తిగా మిగిలిపోయిన బ్రిడ్జిలే పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని తెలిపారు. యువతకు ఉపాధి చూపించే పరిశ్రమలు, సంస్థలు లేవన్నారు. అసంఘటిత కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. ప్రజలకు రక్షణ లేకుండా పోయింది, వేధింపులు పెరిగిపోయాయన్నారు. నగరంలో వామపక్షాల పాలనలోనే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. నేడున్న పాలనలో భారాలు మాత్రమే మిగిలాయన్నారు. నగరం నుండి కమ్యూనిస్టు ప్రతినిధులను అసెంబ్లీకి పంపాలని? మళ్ళీ నగరాభివృద్ధికి శ్రీకారం చుట్టాలని బాబూరావు కోరారు. నేడు జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ పెద్దలు సుబ్బారావు, నాగరాజు, జానయ్య, పి ఆర్ కె రెడ్డి, వెంకటేశ్వరరావు, సిపిఎం నేతలు నటరాజ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో బిఆర్ఎస్కు భారీ షాక్

## - బిఆర్ఎస్‌ను వీడిన కోనేరు కుటుంబం - కాంగ్రెస్‌లో చేరిన కోనేరు చిన్ని బ్రదర్స్

**భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్27:** లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ఓటమిని చవిచూసిన క్రమంలో ఇప్పటికే పలువురు నేతలు పార్టీని వీడారు. ఆ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడంతో కీలక నేతలంతా వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. ఆ పార్టీ కీలక నేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇదే కోవలో కొత్తగూడెం బీఆర్ఎస్ సీనియర్ నేత కోనేరు చిన్ని కూడా శనివారం నాడు గులాబీ పార్టీకి రాజీనామా చేశారు. కోనేరు చిన్నితో పాటు ఆయన బ్రదర్ కోనేరు పూర్ణ చందర్‌రావు



కూడా గులాబీ పార్టీకి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కోనేరు బ్రదర్స్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేతలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి రేవంత్ సాదరంగా ఆహ్వానించారు. మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు వారసుడిగా కోనేరు చిన్ని రాజకీయాల్లోకి వచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలుగుదేశం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా.. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కోనేరు చిన్ని పనిచేసిన విషయం తెలిసిందే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో కోనేరు చిన్ని చేరారు. అయితే బీఆర్ఎస్‌లో చేరే ముందు కీలక పదవులు ఇస్తానని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి పదవులు ఇవ్వకపోవడంతో గులాబీ పార్టీపై కోనేరు చిన్ని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఆ పార్టీని కోనేరు బ్రదర్స్ వీడారు. బీఆర్ఎస్ పెద్దల వైఖరి నచ్చక కాంగ్రెస్‌లో చేరినట్లు కోనేరు బ్రదర్స్ తెలిపారు. వీరితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మధ్యాహ్నం సుమారు 100మంది నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిందని.. తమ జిల్లాను సైతం సంపూర్ణంగా అభివృద్ధి చేస్తుందన్న నమ్మకంతోనే తాము ఈ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని చెప్పారు.

# తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కీలక పరిణామం

## - కాంగ్రెస్‌కు మద్దతుగా సిపిఎం పోటీ నుంచి విరమణ
## - బిజెపిని ఢీకొనేందుకు కలసి పోరాడలని నిర్ణయం - సిఎం రేవంత్‌లో భేటీలో తమ్మినేని సీతారాం చర్చలు

**హైదరాబాద్,ఏప్రిల్27:** తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని సీపీఎం నిర్ణయించుకుంది. సీపీఎం ముఖ్యనేతలతో రేవంత్ రెడ్డి సమావేశి అయ్యారు. పిఎం ముఖ్య నేతలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. లోక్‌సభ స్థానాల్లో మద్దతివ్వాలని సిపిఎం నేతలను రేవంత్ రెడ్డి కోరినట్లు సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం తెలిపారు. అభ్యర్థులను విరమించుకోవాలని సీఎం కోరారు.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బీజేపీ, ఇతర శక్తులు అడ్డుకునేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించు కున్నామని.. ముఖ్యమంత్రితో పాటు ఇతర నాయకులతో చర్చించామన్నారు. భువనగిరి పార్లమెంట్‌తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మరికొన్ని రాజకీయ ప్రతిపాదనలు కూడా వారి ముందు పెట్టామని. బీజేపీ శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చేందుకు వారు అంగీకరించారన్నారు. దేశంలోనూ ఇండియా కూటమితో కలిసి పనిచేయనున్నారని రేవంత్ గుర్తు చేశారు. ఒకట్రెండు విషయాల్లో సందిగ్దత ఉన్నా. అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. సీపీఎం సహకారంతో భవిష్యత్ లో ముందుకెళతామని ప్రకటించారు. ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేస్తుందని భావిస్తున్నా నన్నారు. కమ్యూనిస్టుల్లో మరో పార్టీ అయిన సీపీఐ ఇప్పటికే కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కలసి పోటీ చేశాయి. అయితే సీపీఐకి ఒక్కటంటే ఒక్క స్థానమే కేటాయిం చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్త గూడెం కేటాయించడంతో అక్కడ సీపీఐ గెలిచింది. కానీ తమకు కూడా ఒక్క సీటే కేటాయిస్తామని చెప్పడంతో .. సీపీఎం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులు పెట్టుకోలేదు. విడిగానే పోటీ చేసింది. బలం ఉన్న చోటల్లా పోటీ చేసినా.. స్వయంగా తమ్మినేని వీరభద్రం పోటీ చేసినా ప్రయోజనం లేకపోయింది. ఎక్కడా డిపాజిట్లు కూడా రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి అభ్యర్థుల్ని ప్రకటిం చింది. ఆ అభ్యర్థులు నామినేషన్లు కూడా వేశారు. జాతీయ స్థాయిలో కూడా కలసి పని చేస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇక్కడ పోటీ చేయడం తగదని నిర్ణయించారు. అయితే సీపీఎం అభ్యర్థుల వల్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఎంతో కొంత నష్టం జరుగుతుందన్న భావనతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో కలసి పని చేస్తున్న కమ్యూనిస్టు లతో మాట్లాడాలని నిర్ణయించుకన్నారు. అందుకే తమ్మినేని వీరభద్రంను సిఎం రేవంత్ చర్చలకు ఆహ్వానించి నట్లుగా తెలుస్తో ంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కొంత ఓటు బ్యాంక్ ఉన్న సీపీఎం వల్ల కాంగ్రెస్ పార్టీకి కొంత ఓట్లు కలిసి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# నవరత్నాల పేరుతో నవ మోసాలు

## - నేరాలు, ఘోరాల్లో జగన్‌ది పిహెచ్‌డి - వైసీపీ అధికారంలోకి వస్తే ఏపీలో మళ్లీ అరాచకం - నెల్లూరు ప్రచారంలో చంద్రబాబు హామీ

**నెల్లూరు,ఏప్రిల్27:** నేరాలు, ఘోరాలు, అరాచకాల్లో సీఎం జగన్ రెడ్డి పీహెచ్డీ చేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో దొంగలు పడ్డారని.. మనల్ని మనం కాపాడుకోవాలంటే అందరం కర్రలు చేతపట్టి రోడ్ల మీదకి రావాలని పిలుపునిచ్చారు. రాతియుగం పోవాలి, స్వర్ణయుగం రావాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తాం.. వైసీపీ అధికారంలోకి వస్తే ఏపీలో మళ్లీ అరాచకం సృష్టిస్తుందని చంద్రబాబు విరుచుకుపడ్డారు. నెల్లూరుపాళెం కూడలిలో 'ప్రజాగళం' భారీ బహిరంగ సభలో సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ నవరత్నాలు.. నవమోసాలు అయ్యాయని దుయ్యబట్టారు. 'గులకరాయితో హత్యాయత్నం చేశానని నాపై నింద వేశారు. కోడి కత్తి కేసులోనూ ఇలాంటి ఆరోపణలే చేశారు. బ్యాండేజ్ తీయకుండా డ్రామాలు చేద్దామని జగన్ అనుకున్నారు. అందరూ హేళన చేయడంతో ఇవాళ బ్యాండేజ్ తీసేశారు. గాయం కపడిందా?' అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఈ సభలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్డీఏ కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. నెల్లూరుపాళెం కూడలి జనసంద్రంగా మారింది. కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆత్మకూరు పసుపుమయంగా మారింది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రంలో సైకో జగన్, విజయసాయి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి తప్పించి ఎవరూ బాగుపడలేదన్నారు. ఒక నాయకుడికి పరిపాలన దక్షత ఉండాలన్నారు. సంపద సృష్టించాలి.. కానీ ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేయకూడదని హితవు పలికారు. తెలుగు జాతికి, తెలుగువారికి, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన వ్యక్తి.. ఈ సైకో జగన్ అని విమర్శించారు. జాబు రావాలంటే బాబు రావాలి, గంజాయి ఉండాలంటే జగన్ ఉండాలన్నారు. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్ అని చెప్పారు. అభివృద్ధి జరిగితే సంపద పెరుగుతుందన్నారు. సంపద పెరిగితే ఆదాయాలు పెరుగుతాయని.. ఆర్థిక వ్యవస్థలో ఇదో రహస్యమని వివరించారు. జగన్ అస్సలు చదువుకున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో మన భూములు, ఆస్తులకి రక్షణ లేదన్నారు. బ్రిటీష్ కాలం నుంచి వచ్చిన చట్టాలని, రికార్డులని మార్చేశారని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మీరు కొట్టే దెబ్బ అదిరిపోవాలి. సీనియర్ నేత, అనుభవం ఉన్న వ్యక్తి... జిల్లాను అభివృద్ధి చేసిన వ్యక్తి ఆనం రామనారాయణరెడ్డి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి రాజకీయం, డబ్బులు అవసరం లేదు. తాను సంపాదించిన డబ్బు ప్రజల కోసం ఖర్చుపెట్టారు. పోటీకి ఎవరిని పెట్టారో చూశారా? ఆ వ్యక్తిని ఎప్పుడైనా చూశారా? ఏమైనా అభివృద్ధి చేశారా? సోమశిల డ్యాం, కండలేరు డ్యాంని నిర్మించి డెల్టాని సుస్థిరత చేసిన వ్యక్తి ఎన్టీఆర్, టీడీపీ. నెల్లూరు జిల్లాలో బ్రహ్మాండంగా పంటలు పండుతున్నాయంటే, అది ఎన్టీఆర్ పుణ్యం. ఇక్కడో ఎమ్మెల్యే ఉన్నాడు... దోచుకోవడం తప్పించి అభివృద్ధిపై శ్రద్ధ లేదు. మరో మంత్రి ఉన్నాడు... ఆయనకు గనుల మీదే దృష్టి.

# బలరాం నాయక్ గెలుపుతోనే భద్రాచలం అభివృద్ధి

## మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి



**పినపాక, భద్రాచలం ఏప్రిల్ 27, క్విక్ టుడే న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపుతోనే భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి బాటలో నడుస్తుందని ప్రజలకు వివరిస్తూ మాజీ గ్రంథాలను చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి పట్టణంలో ఉమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని ఇందిరా మార్కెట్ నందు చిరు వ్యాపారస్తులకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే వ్యాపారస్తులకు జరిగే మేలును గురించి వివరిస్తూ,ముఖ్యంగా భద్రాచల నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. అలాగే భద్రాచల రామాలయ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని, మెలిన ఐదు మండలాలను తిరిగి భద్రాచలంలో కలిపి భద్రాచలం మరింత అభివృద్ధి బాటలో నడిపేందుకు దోహదపడుతుందని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ని గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో..ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాస మల్ల రాము, అన్నేం రామిరెడ్డి, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు వసంతాల రాజేశ్వరి, తుమ్మల రాణి, కట్ట కళ్యాణి, పద్మప్రియ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఎ.

# వాహన తనిఖీల్లో నాలుగు లక్షలు పట్టివేత



**పినపాక, ఏప్రిల్ 27, క్విక్ టుడే న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 24 గంటలు నిరంతరం వాహన తనిఖీలలో భాగంగా హనుమాన్ టెంపుల్ ఏరియా మరియు అంబేద్కర్ సెంటర్ ప్రాంతాల్లో. మణుగూరు పోలీసులు సిఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తుల నుండి ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నటువంటి 4 లక్షల రూపాయలను మణుగూరు ఎస్సై రాజేష్ వారి సిబ్బందితో పట్టుకోవడం జరిగింది అట్టి వ్యక్తుల నుండి స్వాధీనం చేసుకున్న డబ్బులను. ఎఫ్ ఎస్ టి, టీం వారికి అప్పగించడమైనదని ఎస్సై రాజేష్ తెలిపారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

## గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు మృతి

**న్యూఢిల్లీ,ఏప్రిల్27:** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంద. ఈ ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు మృతి చెందారు. వీరి కారు సౌత్ కరోలినాలోని గ్రీన్‌విల్లే కౌంటీలోని బ్రిడ్జ్ మీదకు రాగానే అదుపు తప్పి బ్రిడ్జి మీద నుంచి 20 అడుగుల పైకి ఎగిరి ఎదురుగా ఉన్న చెట్లను ఢకొ?ట్టిడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందినటువంటి రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీషాబెన్ పటేల్ మృతి చెందారని.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# రైతుల ఆగ్రహం చూస్తారు

**నాగర్‌కర్నూల్,ఏప్రిల్27:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని స్థానిక బిఆర్ఎస్ నేతలు అన్నారు. సాగుకు సరిపడా నీరు, కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల పాలయ్యారు అన్నదాతలను పట్టించుకోవడం లేదన్నరు. దీంతో రేవంత్ ప్రభుత్వంపై రైతులు గుర్రుగా ఉన్నారు. రేవంత్ రెడ్డికి ఓటేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నామని రైతులు పేర్కొంటున్నారని వారు అన్నారు. ఈ ఎన్నికల్లో వీరంతా మళ్లీ బిఆర్ఎస్‌కు ఓటేస్తారని అన్నారు.నాగర్‌కర్నూల్‌లో వీరు మాట్లాడుతూ.. ఉన్న వడ్లను కొనేందుకు దిక్కు లేదు. ఇక బోనస్ ఎవడిస్తడు. వడ్లన్నీ కుప్ప పోస్తే అవి వర్షానికి తడిసిపోయాయి. వాటిని కొనేతోడే లేడు.. బోనస్ ఎక్కడుంది..? ఎంత ఎండిపోతే అంత నయమనిపిస్తుంది. రుణమాఫీ జోలికి పోతే కొట్టేటట్టు ఉన్నారు. రుణమాఫీ అడిగితే వాళ్లు చెప్పుతో కొట్టడం కాదు.. రేవంత్‌కు ఓటు వేసినందుకు మా చెప్పుతో మేం కొట్టుకోవాలి. రైతులను రేవంత్ మోసం చేసిండు. మనషులు చనిపోతే కనిపిస్తరు.. అదే దేవుళ్లు చనిపోతే కనిపించరు.. కాబట్టే రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేసి కాలం గడుపుతున్నారని వారుపేర్కొన్నారు.

# నగరంలో బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిల నియామకం

**హైదరాబాద్,ఏప్రిల్27:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమన్వయంపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో ప్రచార పర్వాన్ని పరుగెత్తించేలా.. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కోసం సీనియర్ నేతలకు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం నియోజకవర్గాల వారీగా, పలు డివిజన్లకు సమన్వయకర్తలను నియమించారు. జూబ్లీహిల్స్ కుషేక్అబ్దుల్లా సోహైల్‌ను, సికింద్రాబాద్‌కు రాజీవ్‌సాగర్‌ను, అంబర్‌పేటకు దాసోజు శ్రవణ్‌ను, సనత్‌నగర్‌కు వెంకట్‌రెడ్డిని, ముషీరాబద్‌కు పీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ సలీమ్‌లను, నాంపల్లికి మహమూద్‌అలీ, ప్రభాకర్‌రావులను, ఖైరతాబాద్‌కు ఎంఎన్ శ్రీనివాస్‌నుచారు

# ఇవిఎంలపై సుప్రీం తీర్పు శిరోధార్యం !



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ఇవీఎంలపై పలు సందర్భాల్లో విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇవి ట్యాంపరింగ్ అవుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం కూడా పలు సందర్భాల్లో అనుమానాలు నివృత్తి చేసింది. టెక్నీషియన్ల సమక్షంలో వాటి పనితీరును ప్రదర్శించింది. 140కోట్ల జనాభా వున్న భారత్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ వల్ల ప్రజాస్వామ్యం బలపడిందే తప్ప వెనకడగు వేయలేదు. గతంలో పదేళ్ల పాటు అదికారం వెలగబెట్టిన కాంగ్రెస్ హయాంలో కూడా ఇవిఎంల ద్వారానే ఓటింగ్ జరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ ఈ మధ్యే మోడీ అధికారంలోకి రావడం తో ఈ అనుమానాలు కావాలని రేకెత్తిస్తున్నారు. మోడీ పోటీచేసిన 2014లో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నది మరచిపోరాదు. 2019లో మాత్రమే మోడీ తన అధికారం ఉండగా మళ్లీ గగెలుపొందారు. ఇవిఎంలపై ఇలా అనుమానాలు వ్యక్తం చేయడం ద్వారా కొందరు తమ సంకుచిత రాజకీయాలను ప్రదర్శిం చారు. అలాగే మళ్లీ బ్యాలెట్ పద్దతిలో ఎన్నికలు నిర్వహించాలని కొందరు వితండవాదం చేస్తున్నారు. బ్యాలెట్ బాక్సులు ఎత్తుకెళ్లడం, ఇంకు పోయడాలు,దాడులు చేయడం, వాహనాలను దారిమళ్లించడం వంటి ఎన్నో సంఘటనలు చూశాం. ఈ క్రమంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా తీర్పు రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇవిఎంలలో నమోదైన ఓట్లన్నింటినీ వీవీప్యాట్ స్లిప్పులతో నూటికి నూరుశాతం సరిపోల్చిన తరువాతే విజేతలను నిర్ణయించాలంటూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టి వేసింది. రెండురోజుల పాటు విచారణ జరిపి, సరిగ్గా తొలిదశ పోలింగ్ ముందురోజున తీర్పును రిజర్వు చేసిన ఇద్దరు న్యాయమూర్తులూ పదిరోజుల్లోనే దానిని ప్రకటించడం ద్వారా వారు ఈ కేసుకు ప్రాధాన్యానికి ఇచ్చి దేశ గౌరవాన్ని నిలిపారనే చెప్పాలి. అదే సందర్భంలో ఇలాంటి కేసులు వేసే వారికి కూడా హెచ్చరిక చేశారు. ఈవీఎంలమీద నిరసన ప్రదర్శనలు, చర్చాకార్యక్రమాలు జరుగుతుం డటం, ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి ప్రముఖులు లేఖలు రాయడం వంటి పరిణామాల నేపథ్యంలో పిటిషన్ల విచారణ, తీర్పు ప్రకటన త్వరితంగా రావడం అత్యవశ్యకమని సర్వోన్నత న్యాయస్థానం భావించి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ 'ఈవీఎం–వీవీప్యాట్ల లెక్కింపు'నకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ లలో పోలైన అన్ని ఓట్లను మొత్తం వీవీప్యాట్ల స్లిప్పులతో అంటే స్లిప్పులతో సరిపోల్చాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. బ్యాలెట్ పద్ధతిలోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పును వెలువరించింది. వివి ప్యాట్ల లెక్కింపు అంటే ఓ రకంగా బ్యాలెట్ లెక్కింపు లాంటిదనే గుర్తించాలి. ఇవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ పోల్చి చూడాల్సిన పని లేదు. స్లిప్పులను తీసుకుని ఓటరు మరో బాక్స్‌లో వేయాల్సిన అవసరం కూడా లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రొటోకాల్స్, సాంకేతికంగా ఈవీఎంల పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి.. అధికారులను అడిగి అన్ని వివరాలను తెలుసుకున్నాకే ఈ తీర్పు చెప్తున్నామని న్యాయమూర్తులు ప్రకటించారు. ఇవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులను వందశాతం సరిపోల్చాలని వచ్చిన పిటిషన్లు సరికాదని ధర్మాసనం తేల్చింది. అయితే ఇవీఎంలలో ఎన్నికల గుర్తులను లోడ్ చేశాక ఆ యూనిట్‌ను సీల్ చేయాలి. అనంతరం వీటిని కంటైనర్లలో భద్రంగా పెట్టాలి. పలితాలు వెలువడిన కనీసం 45 రోజుల వరకు ఈవీఎంలతో పాటు, వీవీప్యాట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చాలని ఇసిని ఆదేశించడం గమనార్హం. ఎన్నికల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తే, వాటిని తనిఖీ చేసుకోవచ్చని కూడా సూచించింది. ఇవీఎంలలోని మైక్రోకంట్రోలర్‌లో బర్న్ చేసిన మెమొరీని ఈవీఎం తయారీదారులైన ఇంజినీర్ల సాయంతో అభ్యర్థులు ఈ తనిఖీలు నిర్వహించుకోవచ్చన్న వెసులబాటును కూడా సుప్రీం ధర్మాసనం కల్పించింది. కంట్రోల్ యూనిట్‌లోని 5 శాతం ఈవీఎంలను, వీవీప్యాట్లను సరిపోల్చుకొని ఈ విధంగా తనిఖీ చేయించుకోవచ్చని తెలిపింది. ఇలాంటి తీర్పుతో మన ప్రజాస్వామ్యం మరింత బలపడిందనే చెప్పాలి. ఇవిఎంలతో కర్నాటక, తెలంగాణల్లో అధికారం దక్కించు కున్న కాంగ్రెస్ అగ్రనేతలు ఇప్పుడు దీనికి సమాదానం చెప్పాలి. అక్కడా ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించాల్సి ఉంటుందా అన్నది చెప్పాలి. ఈవీఎం వ్యవస్థమీద న్యాయమూర్తులు అపరిమిత విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు తీర్పుల్లో ఏకాభిప్రాయాన్ని ప్రకటించడం మరీ విశేషం. పిటిషన్‌దారులు వెలిబుచ్చిన అన్ని అభ్యంతరాలు, అనుమానాలు, చేసుకున్న విన్నపాలు అన్నింటినీ కొట్టివేస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేయగం గమనార్హం. బ్యాలెట్ పేపర్ వాడిన రోజుల్లో దేశం ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నది. బూత్‌ల స్వాధీనం, బ్యాలెట్ పత్రాలను నాశనం చేయడం వంటివి చాలా జరిగాయి. ఈవీఎంలు వచ్చిన తరువాత ఆ తరహా అక్రమాలకు పూర్తిగా తెరపడింది. అంతమాత్రాన ఈవీఎంలను ఎంతమాత్రం అనుమానించకూడదని ఏమీ లేదు. వాటిని ట్యాంపర్ చేయవచ్చునన్న వాదనలు, ప్రదర్శనలు జరుగుతున్నప్పుడల్లా ఎన్నికల సంఘం ఖండిస్తూ వస్తున్నది. గుడ్డిగా ఒక వ్యవస్థను అనుమానించడం సరైనది కాదని న్యాయమూర్తులు అన్నారు. సాంకేతిక అంశాలను, నమోదైన డేటాను పరిశీలించిన తరువాత ఈవీఎంలపై అనుమానాలు సహేతుకమైనవి కావని నిర్ధారణకు వచ్చినట్టుగా న్యాయమూర్తులు ప్రకటించారు. కొందరు స్వార్థపరశక్తులు ఈ దేశం సాధించిన విజయాలను తక్కువ చేయాలని చూస్తున్నారని, అభివృద్ధిని బలహీనపరచేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలను మొగ్గలోనే తుంచేయాలని ఒక న్యాయమూర్తి ఆగ్రహించారు. 97కోట్ల మంది ఓటర్లున్న దేశంలో నూరుశాతం పేపర్‌స్లిప్పులను సరిపోల్చడం అసాధ్యం. ఇలాంటి పరిస్థితుల్లో అనుమానాలు పక్కన పెట్టి, వాటిని నివృత్తి చేసుకోవాలన్న సుప్రీం ధర్మాసనం సూచనలు శిరోధార్యం.

# ప్రచారంలో పురందేశ్వరి దూకుడు

## - ఎన్టీఆర్ తనయగా అన్నివర్గాల నుంచి మద్దతు - బిజెపికి అనుకూలంగా మారుతున్న సమీకరణాలు



**రాజమండ్రి,ఏప్రిల్27:** ప్రచారంలో పురందేశ్వరి దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఎన్టీఆర్ తనయగా అన్నివర్గాల నుంచి మద్దతు దక్కుతోంది. బిజెపికి అనుకూలంగా మారుతున్న సమీకరణాలు మారుతు న్నాయి. మోడీ నినాదం కూడా బాగా కలసి వస్తోంది. రాజమండ్రి సీటులో ఇప్పుడు ఎన్టీఆర్ తనయ పురంధేశ్వరి దూసుకుపోతోంది. 'తూర్పు' ఆడబడుచుగా సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంట్ బరిలో బీజేపీ తరపున అడుగుపెట్టారు. గోదావరి తీరంతో ఎన్టీఆర్‌కి ఉన్న అనుబంధం.. తూర్పుగోదావరి జిల్లాలో కమలానికి ఉన్న ఆదరణ కలగలిపి ఆమె విజయం నల్లేరుపై నడకేననే ధీమా వ్యక్తమవుతోంది. ఆ కుటుంబాన్ని వర్గవర్ణాలకు అతీతంగా అభిమానించే వాళ్లకు కొదువ లేకపోవడం.. మూడు పార్టీల పొత్తుతో వచ్చిన జోరు ఆ ధీమాకు కారణం కావచ్చు. దీంతో కులమతాలకతీతంగా రాజమహేంద్రి ఎన్టీఆర్ కూతురికి స్వాగతం పలుకుతోంది. జిల్లాలోని బీజేపీలో ఏదో తెలియని నైరాశ్యం అలముకుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని పార్టీలో వర్గపోరు నెలకొంది. ఇప్పటికీ రెండు మూడు వర్గాలుగా చీలిపోయి ఎవరి తీరు వారిదే అనే చందంగా పార్టీ ఉంది. అందరినీ ఓ దారికి తీసుకు రావడం ఇప్పుడు పురందేశ్వరి ముందున్న పెద్ద సవాల్. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ కుటుంబానికి అన్ని వర్గాల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉండడం ఆమెకు అధిక శాతం కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. 1998లో గిరజాల వెంకటస్వామినాయుడు, తర్వాత ఎస్పీబీకే సత్యనారాయణను ఇక్కడి ప్రజలు పార్లమెంట్‌కి పంపించారు. సత్యనారాయణ కేంద్ర మంత్రిగా కూడా సేవలందించారు. 2014లో ఆకుల సత్యనారాయణ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా కమలం గుర్తుపై గెలు పొందారు. 1998లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు వంటి హేమాహేమీలు వాజ్‌పేయి ప్రభుత్వ సమయంలో బీజేపీలో చేరారు. కాకినాడలో పెద్ద సంఖ్యలో కవాతు నిర్వహించారు. 1984 నుంచి 2019 వరకూ జరి గిన పది లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి బీజేపీ రెండు సార్లు ఎంపీలు ఢిల్లీకి వెళ్లారు. ఓసారి రాజమహేంద్రవరం నుంచి కమలం తరపున ఎమ్మెల్యే సారథ్యం వహించారు. పురందేశ్వరికి రాజకీయంగా తండ్రికి దగ్గ కూతురు అనే పేరుంది. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో ఎన్నో ప్రాధాన్యం ఉన్న పదవులను ఆమె కైవశం చేసు కున్నారు. ఆమె వాక్చాతుర్యం, శ్రమించే తత్వం చూసి ఆయా పార్టీల పెద్దలు కీలకమైన బాధ్యతలు అప్పగించారు. ఏ పార్టీలో ఉన్నా ఆమె తనకంటూ ఓ అస్థిరత సముపార్జించుకున్నారు. 2004లో బాపట్ల నుంచి తొలిసారి లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందారు. 2009లో విశాఖపట్నం నుంచి రెండో సారి ఎంపీగా ఎన్నికై మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో వాణిజ్యం, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రిగా సేవలందిం చారు. 2014లో బీజేపీలో చేరారు. అనతికాలంలోనే మహిళా మోర్చా ప్రధాన ప్రభారిగా, బీజేపీ ఒడిశా ఇన్‌చార్జి, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఇండి పెండెంట్ డైరెక్టర్ తదితర హోదాల్లో పనిచేశారు. 2023 జూలై 4న ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ బీజేపీలో తొలి మహిళా అధ్యక్షు రాలిగా రికార్డు సాధించారు. . రాజమహేంద్రవరం ఎంపీగా ఆమె గెలిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధికి నిధులు సునాయాసంగా తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ ఐదేళ్లలో పారిశ్రామికంగా, పర్యాట కంగా జిల్లా వెనకడుగు వేసిందనడంలో సందేహం లేదు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అంతంత మాత్రమే. పెద్ద ప్రాజెక్టులు కూడా ఏమీ మంజూరు కాలేదు. మరోవైపు ఆమె గతంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయ మంత్రిగా పని చేయడంతో యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని స్థానిక బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. పురందేశ్వరిని రాజమండ్రి నుంచి పార్లమెంట్‌కి కచ్చితంగా పంపిస్తాం అని అంటున్నారు.

# ప్రచారంలో కారు జోరు..

## - గెలుపు లక్ష్యంగా అప్రమత్తం అయిన నేతలు - రైతులే ఎజెండగా ప్రణాళికా బద్దంగా ప్రచారం



**నిజామాబాద్,ఏప్రిల్27:** లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నది. అసెంబ్లీలో ఓటమితో ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నది. పార్టీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్ కుమార్ క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణెశిశ్‌గుప్తా, పార్టీ ముఖ్య నేతలు ప్రచార బాధ్యతలు చేపట్టారు. అటు జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జాజాల సురేందర్, గంప గోవర్ధన్ తదితరులు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు, ప్రత్యర్థి పార్టీల ప్రచారానికి దీటుగా ప్రచారం చేస్తున్నా బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై విమర్శలు ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని బాండు రాసిచ్చి ఐదేండ్ల పాటు మోసం చేశారన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. ఇక జగిత్యాల జిల్లాకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి నిజామాబా ద్ జిల్లా నాయకుల నుంచి పూర్తి స్థాయి సహకారం అందడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. అందుకే ప్రచారం ముమ్మరం చేయలేక పోతున్నారనే వాదన వినిపిస్తున్నది. బిఆర్‌ఎస్ అధికారం లో ఉండగా కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. అయితే రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు.

# ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం

## భవిష్యత్తులోనూ ప్రజల కోసం కొట్లాడుతాం

## తెలంగాణ భవన్‌లో పార్టీ జెండా ఆవిష్కరణలో కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్27:** విజయాలకు పొంగిపోము, అపజయాలకు కృంగిపోమనేలా తమ ప్రస్థానం సాగుతుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం మాట్లాడుతూనే ఉంటాం.. కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణకు ఒక గొంతుక ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్‌ఎస్ అని వెల్లడించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అన్న జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ వాస్తవంగా నిలుస్తాయన్నారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో ఉన్న శూన్యం లాంటి వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ ఏర్పాటు చేశారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం దేశంలోని అనేక రాష్ట్రాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఒక దిక్సూచిగా, ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సహకారంతోనే రాష్ట్రం సహకారమయిందని, పార్టీ తరఫున ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమ న్నారు. సమైక్యవాద శక్తుల కుట్రలను ఛేదించి తెలంగాణ ప్రజల గొంతుకను అన్ని చట్టసభల్లో టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) వినిపించిందని చెప్పారు. సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దే అని 2014లో తమ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు, అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఒక సదుద్దేశంతో పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో బీఆర్‌ఎస్‌కు అద్భుతమైన స్పందన లభించిందని వెల్లడించారు. అయితే దురదృష్టవశాత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన ఏ పనినైనా వదలకుండా ముందుకు తీసుకుపోయిన చరిత్ర గత రెండున్నర దశాబ్దాలలో ప్రజలందరికీ తెలుసన్నారు. బోధించు, సమీకరించి, పోరాడు అనే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఒంటపట్టించుకుని ముందుకు నడుస్తున్న పార్టీ బీఆర్‌ఎస్ అని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరికీ, తమకు మద్దతుగా నిలబడిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల కోసం, వారి ఆకాంక్షల కోసం పోరాడిన గులాబీ దండుకు, ప్రాణాలు అర్పించి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిస్తున్న బాటలో మరోసారి పూనరంకితం అవుతామని స్పష్టం చేశారు.

# మోపూరిత కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరు

## ఆవిర్భావ సభలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



**నల్లగొండ,ఏప్రిల్27:** బీఆర్‌ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజల గోసకు కారణమైన ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు పిల్ల మూకలు ఓ లెక్క కాదన్నారు. నల్లగొండలో పార్టీ నాయకులు కోటిరెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్‌తో కాలిసి బీఆర్‌పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ప్రజలు పాధి కోసం మళ్లీ విదేశాల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ సర్కార్‌లో పచ్చని పంటలతో కలకలలాడే భూములు బీడుగా మారాయని విమర్శించారు. పదేండ్లు అద్భుతంగా నిర్మించిన తెలంగాణను మూడు నెలల్లోనే కుప్పకూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తమ జీవితంలో నిజాలు మాట్లాడలేదని ఫైర్ అయ్యారు.

# కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

## - మాయమాటలతో అధికారంలోకి వచ్చారు

## -అవిర్భావ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట,ఏప్రిల్27:** కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మాయమాటలు చెప్పి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేసిందని చెప్పారు. ఒక్కడితో మొదలైన బీఆర్‌ఎస్ ప్రస్థానం ఉధృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి చేసి ప్రజలను కేసీఆర్ చైతన్యపరిచారని తెలిపారు. అంగబలం, అర్థబలం కలిగిన ఆంధ్ర నాయకత్వాలను ఎదిరించి నిలబడ్డారని చెప్పారు. తెలంగాణ వాదాన్ని అణిచవేయాలన్న ప్రతిసారి ఉద్యమం మరింత ఉధృతం చేశారన్నారు. తన పదవులను గడ్డిపోచలుగా వదిలేసి ప్రజల్లో చర్చపెట్టి తెలంగాణ వాదాన్ని గెలిపించారన్నారు. జలదృశ్యం నుంచి జన దృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు, అణచివేతలు, అనుమానాలు ఎదురయ్యాయని గుర్తుచేసుకున్నారు.

# వెధవ అంటే... వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు

**పొన్నం తిట్లను దీవెనలుగా భావిస్తా**
**ఓటుకు రూ.వెయ్యి ఇచ్చి గెలవాలని కాంగ్రెస్ యత్నం**
**10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అరాచకాలను వివరించండి**
**బోయినిపల్లిలో లూటీ చేసిన కుటుంబం పరారీలో ఉంది**
**నా లేఖలవల్లే నిధులొచ్చాయని డబ్బా కొట్టుకునే వినోద్ చేసింది శూన్యం**
**కేసీఆర్ కు దోచిపెట్టడం తప్ప..**
**కుటుంబానికి దాచిపెట్టడం తప్ప సాధించేదేమీ లేదు**
**కేసీఆర్ అనే నాణేనికి కాంగ్రెస్, బీఆర్ఎస్**
**అభ్యర్థులు బొమ్మ, బొరుసులాంటోళ్లు**
**చీకటి ఒప్పందాలతో నన్ను ఓడించాలని కుట్ర చేస్తున్నరు**
**చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి పన్నా ప్రముఖ్ ల భేటీలో బండి సంజయ్ వ్యాఖ్యలు**



**కరీంనగర్ :** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతామనే భయంతోనే మంత్రి పొన్నం ప్రభాకర్ తనను వెధవ అంటూ దూషిస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. పొన్నం తిట్లు దీవెనలుగా భావిస్తున్నానని చెప్పారు. పొన్నం వెధవ అంటే తన ద్రుష్టిలో 'వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు" అని అర్ధమని చెప్పారు. ఓడిపోతామని తెలిసి ఓటుకు రూ.వెయ్యి ఇచ్చి గెలవాలని కాంగ్రెస్ అభ్యర్థి యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి 6 గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ చేసిన మోసాలతోపాటు గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన ద్రోహాన్ని వివరించి బీజేపీకి ఓటేయించాలని కోరారు. దేశమంతా నరేంద్రమోదీ గాలి వీస్తున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ కార్యకర్తలంతా తమ తమ పోలింగ్ బూత్ ల పరిధిలోని తటస్థ ఓటర్లతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఇంటింటికీ పార్టీ పన్నా ప్రముఖ్ లు పోలింగ్ తేదీ నాటికి ప్రతి ఇంటికీ 5 సార్లు వెళ్లి ఓట్లు అభ్యర్థించడంతోపాటు తమ తమ పోలింగ్ బూత్ పరిధిలో 100 శాతం పోలింగ్ జరిగేలా క్రుషి చేయాలని సూచించారు. నూటికి నూరుశాతం ఓట్లు వేయించే పోలింగ్ బూత్ బాధ్యులను తాను స్వయంగా అభినందించడంతోపాటు సన్మానిస్తానని చెప్పారు. ఈరోజు మధ్యాహ్నం బోయినిపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్ మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభతో కలిసి పార్టీ పన్నా ప్రముఖుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ముఖ్యాంశాలు... దేశమంతా నరేంద్రమోదీ గాలి వీస్తున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ కార్యకర్తలంతా తమ తమ పోలింగ్ బూత్ ల పరిధిలోని తటస్థ ఓటర్లతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అభ్యర్థించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కోరారు. ఎన్నికల నాటికి ప్రతి కార్యకర్త ఇంటింటికీ మూడు సార్లు వెళ్లి ఎన్నికల ప్రచారం చేయాలని సూచించారు. తద్వారా అత్యధిక మెజారిటీతో గెలవడం ద్వారా కరీంనగర్ ప్రజా తీర్పును దేశానికి చాటి చెప్పి చరిత్ర స్రుష్టిద్దామని చెప్పారు. మోదీ పాలనలో దేశాభివ్రుద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారం కోసం విప్లవాత్మక చర్యలు తీసుకున్న ఘనత నరేంద్రమోదీదే. ఈ విషయాలన్నీ ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలి. కమిట్ మెంట్ విషయంలో పన్నా ప్రముఖ్ లను మించినోళ్లు లేరు. క్రమశిక్షణతో ప్రతి ఇంటికీ వెళ్లి సంస్కారవంతంగా నమస్కరిస్తూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, బీజేపీ విధానాలను, సిద్ధాంతాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలి. మొన్నటి దాకా బోయినిపల్లిలో ఒక కుటుంబం అరాచకంగా వ్యవహరించింది. కొందరు పోలీసులు వారికి వత్తాసు పలికారు. ఇప్పుడు ఆ కుటుంబం



పరారీలో ఉంది. వత్తాసు పోలీసుల పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఆనాడు భైంసాలో దారుణాలు జరిగినా ఎవరూ పట్టించుకోలేదు. మొన్న చెంగిచర్లలో మహిళలను అవమానించారు. గర్భవతులపై, చిన్నారులపైనా దాడులు చేశారు. కార్యకర్తలెవరూ ఇక భయపడాల్సిన పనిలేదు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో వెనుకంజ వేయాల్సిన అవసరం లేదు. మీ అందరికీ నేను అండగా ఉన్నా. కేసీఆర్ పాలనలోనే ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, కేసులు పెట్టినా, అరెస్ట్ చేసినా భయపడకుండా పోరాడానని, వందల కేసులు నమోదు చేసినా వెనుకంజ వేయలేదు. ప్రజలు పోరాడే వారి పక్షాన ఉంటారనడానికి ఎన్నికల ప్రచారంలో తనకు వస్తున్న మద్దతే ఇందుకు కారణం.ఎన్నికల ప్రచారంలో బీజేపీ కార్యకర్తలంతా ధైర్యంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లడగవచ్చు. ఎందుకంటే రాష్ట్రంలో గత ఐదేళ్లుగా బీజేపీ నాయకులు, తాను చేసిన పోరాటాలను వివరించి గల్లా ఎగరేసుకుని ఓట్లడగండి. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏం చేశారని.. ఆయా పార్టీల కార్యకర్తలు ఓట్లు అడుగుతారో చెప్పాలి. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఘోరంగా ఓటమి పాలుకాబోతున్నయ్. ఎందుకంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా మోదీపట్ల సానుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు సైతం మోదీపట్ల, బీజేపీపట్ల సానుకూలంగా ఉన్నందున వారిని కలిసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఓడిపోతాననే భయంతో కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు రూ.వెయ్యి పంచి గెలవాలని యత్నిస్తున్నరు. బీఆర్ఎస్ అభ్యర్థి లేఖలు రాయడం, తాను చేసిన అభివ్రుద్ధితోపాటు తెచ్చిన నిధులను తన ఖాతాలో వేసుకోవడం తప్ప సాధించిందేమీ లేదు.. 10 ఏళ్లు అధికారంలో ఉంటూ కూడా కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణానికి నిధులు తీసుకురాలేదు. నేను సేతు బంధన్ స్కీం కింద రూ.154 కోట్లు తెచ్చి ఆర్వోబీని నిర్మిస్తున్న. మన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల విస్తరణ కోసం వేలాది కోట్లు నేను తీసుకొస్తే.. నా లేఖలవల్లే వచ్చాయని చెప్పడం సిగ్గుచేటు. కేసీఆర్ అనే నాణేనికి బొమ్మ, బొరుసులాంటి వాళ్లు ఇక్కడున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు. ఇద్దరూ కలిసి చీకటి ఒప్పందాలు చేసుకుని నన్ను ఓడించాలని కుట్ర చేస్తున్నారు. అందుకే దొంగ హామీలిస్తూ మోసం చేయాలని చూస్తున్నరు. వడ్లకు బోనస్ ఇవ్వడానికి, తరుగు, తాలుతో సంబంధం లేకుండా వడ్లు కొనడానికే డబ్బులు లేనోళ్లు..రూ. 2 లక్షల రుణమాఫీ పేరుతో రూ.30 లక్షల కోట్లు ఎక్కడి నుండి తీసుకొస్తారు? మోదీ ప్రభుత్వం పొరపాటున అధికారంలోకి రాకపోతే రైతులకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీలను ఎత్తివేస్తారు.. మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కసుతో తనను వెధవ, రండ అంటూ బూతులు తిడుతున్నారు. ఆయన గురించి పట్టించుకోవాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే ఆయన వద్దకు పోవాలంటే ఆ పార్టీ కార్యకర్తలే భయపడుతున్నారు. అయినా పొన్నం తిట్లను నేను దీవెనలుగా భావిస్తున్నా. వెధవ అంటే 'వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు' అని భావిస్తున్నా. నేను చేసిన పోరాటాలతో బీజేపీ కార్యకర్తల గల్లా ఎగరేసుకునేలా చేసిన. కరీంనగర్ ప్రజలు వేసిన ఓటుకు విలువ తీసుకొచ్చానే తప్ప ఏనాడూ ఏసీల్లో కూర్చోలే.. మీరున్నారనే ధైర్యంతో కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడలే. దేశంలో ఏ ఎంపీపైనా లేనన్ని కేసులు నాపై పెట్టినా వెనుకంజ వేయకుండా ఫాంహౌజ్ లో ఉన్న కేసీఆర్ ను గల్లాపట్టి ధర్నా చౌక్ కు గుంజుకొచ్చిన. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నన్ను రెండు సార్లు జైలుకు పంపినా కేసీఆర్ గద్దె దిగే వరకు పోరాడిన చరిత్ర నాది... కాబట్టి వాస్తవాలు ప్రజలకు వివరించి బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నా..

## ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలు తెల్సుకుని బీజేపీ పార్టీని ఆదరించి నన్ను ఆశీర్వదించి భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు





**వరంగల్ :** వరంగల్ పశ్చిమ మరియు తూర్పు నియోజకవర్గం 4 మరియు 42 డివిజనల్లో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మరియు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ గారు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నా ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని కేంద్రం తెలంగాణకు చేసిన సహాయంతో పాటు కాంగ్రెస్ మరియు రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలు తెల్సుకుని బీజేపీ పార్టీని ఆదరించి నన్ను ఆశీర్వదించి భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు

ఈ కార్యక్రమంలో బిజెపి వరంగల్ పార్లమెంట్ ప్రభరి డా. వి. మురళీధర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ కంధగట్ల సత్యనారయణ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్,కుసుమ సతీష్,వన్నల వెంకట్రామ,డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, అర్జున్ గౌడ్,మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీ రత్నా, జిల్లా బిజెపి నాయకులు దొంతుల వాసుదేవ రెడ్డి, నార్మెట్ట శ్రీనివాస్ రాజు, పరమేశ్వర్, రవీందర్,అరణ్య రెడ్డి, మురళీ, ఏడుకొండలు, సత్యనారయణ,ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



# ఈ వి ఎం యంత్రాల పనితీరుపై అవగాహన అవసరం

## : ఏ ఆర్ ఓ/ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

### సెక్టోరల్ అధికారులకు ఈవీఎం ల కమీషనింగ్ పై శిక్షణ.....

**వరంగల్ 27 ఏప్రిల్ 2024 :** ఎలక్ట్రాన్ ఓటింగ్ మిషన్ (ఈ వి ఎం)యంత్రాల పనితీరు పై అవగాహన అవసరం అని ఏ ఆర్ ఓ/ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు.

15-వరంగల్ లోక్ సభ ఎన్నికల నిర్వహణ నేపద్యం లో వరంగల్ (తూర్పు)నియోజకవర్గ పరిధి లోని సెక్టోరల్ అధికారులకు బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన ఈ వి ఎంల శిక్షణ కార్యక్రమానికి ఏ ఆర్ ఓ ముఖ్య అతిధిగా హాజరై సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీలు నమూనా ఈవీఎం లు బ్యాలెట్ యూనిట్ (బి యు)లు వి వి ప్యాట్ లద్వారా అవగాహన కలిగిస్తూ



అభ్యర్థులు సంఖ్యను దృష్టి లో ఉంచుకొని బ్యాలెట్ యూనిట్ లను అనుసంధానించడం బి యు నుండి వివి ప్యాట్ లకు అనుసంధించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఏఆర్ఓ మాట్లాడుతూ సెక్టొరల్ అధికారులు నియోజక వర్గం లో క్షేత్రస్థాయిలో పర్యటించి వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను గుర్తించాలని, పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల ఏర్పాటు ఓటర్లకు నీడ సౌకర్యం త్రాగు నీరు వరుస క్రమం లో ఓటు వేయడానికి వీలుగా క్యు లైన్లు టాయిలెట్ ల ఏర్పాటు ఉండేలా చూడాలని, పర్యవేక్షణ కోసం నోడల్ అధికారి రవికుమార్ ను నియమించడం జరిగిందని వారి సేవలు వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ సంబంధిత మెటీరియల్ ను మెటీరియల్ నోడల్ అధికారి నుండి పొందాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్, కుడా సి పి ఓ అజిత్ రెడ్డి, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్ సెక్రటరీ విజయలక్ష్మి తహసిల్దార్లు ఇక్బాల్ నాగేశ్వరరావు మాస్టర్ ట్రైనింగ్ సందీప్ కుమార్ పాల్గొన్నారు

## ఉపాధి వేతనం రోజు కూలి 600 రూపాయలు, వారి భద్రత కట్టుదిట్టం చేయాలి అని డిమాండ్ చేశారు




**దమ్మపేట: ఏప్రిల్ 27,** ఉపాధి వేతనం రోజు కూలి 600 రూపాయలు, వెంటనే అమలు చేయాలి. జంగిలి పని ప్రదేశంలో తేలు, పాములకు భయభ్రాంతులకు గురైన ఉపాధి కూలీల కు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము డిమాండ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంకటాద్రి గూడెం గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలపై పోరాటం చేయాలని, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము అన్నారు పని ప్రదేశంలో,రోజు,తేళ్లు,పాములు, దర్శనమిస్తున్నాయని అన్నారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని. తక్షణమే టెంట్లు . మెడికల్ కిట్లు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందజేయాలని,ఆయన అన్నారు.ఉపాధి హామీ కూలీల పనులను పరిశీలించిన రాము ఈ విధంగా మాట్లాడుతూ ఇచ్చేది తక్కువ వేతనాలే అయినప్పటికీ వేసవికాలంలో ఎలాంటి ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక ఉపాధి పనికి వెళుతున్నారని అన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్ ఎం ఎం ఎస్) పేరుతో మొబైల్ యాప్ ని ప్రవేశపెట్టడం కార్మికులకు సమస్యలను మొదలైన అని అన్నారు.ఈఎస్ఐ పిఆర్సి ని అమలు చేయాలి 12000 రూపాయలు జీవన భృతి అమలు చేయాలని మహిళలకు 2500 రూపాయలు వెంటనే బ్యాంకు ఖాతాలు వేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిల రైతు సంఘం నాయకులు పండూరి వీరబాబు, మద్దెల సుందరమ్మ, జిల్లబత్తుల శ్రీను,ఎలక హరిబాబు,ఎలక శ్రీను,తుమ్మ రాఘవులు, బీరెల్లి భాస్కరరావు, ఎలక తిరుపతమ్మ, మద్దెల జేమ్స్, ఎలక సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ రైల్వే జోన్ పరిధిలో రెండు రోజులు నీటి సరఫరా బంద్

**60 ఎం ఎల్ డి రిజర్వాయర్ వద్ద కొనసాగనున్న నిర్వహణ పనులు....**
**సోమ, మంగళ వారాల్లో నీటి సరఫరా నిలిపివేత....**

**వరంగల్ : 27ఏప్రిల్ 2024 :** ధర్మసాగర్ లోని 60 ఎంఎల్ డి రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ వారు నిర్వహణ పనులు చేస్తున్న కారణం గా వరంగల్ అండర్ రైల్వే జోన్ పరిధి లో ఏప్రిల్ 29 (సోమవారం) నుండి ఏప్రిల్ 30 (మంగళ వారం) మధ్యాహ్నం వరకు నీటి సరఫరా నిపిలివేయడం జరుగుతుందని కావున అట్టి ప్రాంత వాసులు గమనించి వేసవి కాలం నేపద్యం గా నీటిని పొదుపు గా వాడుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సహకరించాలని బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర నేడోక ప్రకటన లో కోరారు. ఇట్టి కారణం గా అండర్ రైల్వే జోన్ పరిధిలోని ప్రాంతాలైన కరీమాబాద్, శివనగర్, రంగసాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాక రాశి కుంట, ఎస్.ఆర్.ఆర్. తోట, ఏకశిలా నగర్, కాశీ కుంట, ఖిలావరంగల్, ధూప కుంట, వసంతపురం, స్తంభం పల్లి, నక్కలపెల్లి, లక్ష్మీపురం, బట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ,దేవన్న పేట ప్రాంతాలలో పైన సూచించిన రోజుల్లో నీటి సరఫరా ఉండదని, కావున ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఈ సందర్భం గా ఆయన విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేయండి

**వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి**



**వరంగల్ : 27ఏప్రిల్ 2024 :** మెప్మా సిబ్బంది పోలింగ్ శాతం పెంచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు.






లోక్ సభ ఎన్నికల నేపద్యం లో 15-వరంగల్ లోక్ సభ నియోజక వర్గపరిధి 106%-%వరంగల్ (తూర్పు) నియోజక వర్గానికి సంబం దించి స్వీప్-2024(సిస్టమా టిక్ ఓటర్ ఎడ్యుకేషన్ ఏలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమం లో భాగం గా శనివారం కాకతీయ మెడికల్ కళాశాల (కే ఎం సి )సెమినార్ హాల్లో (రిసోర్స్ పర్సన్) ఆర్ పి లకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఓటర్లలో చైతన్యం తేవడానికి కళాజాత బృందాల సహకారం తో ఆట పాటలు రంగోలి పోటీలు, మెహందీ, మొగ్గుల పోటీలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృతం గా ప్రచారం నిర్వహిస్తున్నామని, వీటి అంతిమ ఉద్దేశం పోలింగ్ శాతం పెరగడం కోసమేనని, ఆర్ పి లకు క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఉంటాయని, ఓటరు స్లిప్పులు అందజేసే ప్రక్రియ లో భాగంగా ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి వారిని పోలింగ్ కార్యక్రమం లో భాగస్వాములను చేయాలని అన్నారు. బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నేపద్యం లో మెప్మా సిబ్బంది ప్రధానంగా ఆర్ పి లు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) ను ఉల్లంఘించడానికి వీలు లేదని వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే ఎన్నికల ర్యాలీలలో సమావేశాలు పాల్గొనడానికి అనుమతి లేదని,ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భం గా ఆర్ పి లతో పాటు సమావేశం లో పాల్గొన్న అధికారులు సిబ్బంది చేత ఎన్నికల ప్రతిజ్ఞ నిర్వహింపజేశారు. అంతకు ముందు సెమినార్ హాల్ నుండి మెడికల్ కళాశాల ప్రధాన ద్వార కాకతీయ కళా తోరణం వరకు ఎన్నికల అవగాహన ర్యాలీ జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పిడబ్ల్యుడి జిల్లా నోడల్ అధికారి సత్యవాణి, మెప్మా పిడి బద్రు నాయక్, వరంగల్ (తూర్పు) నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి కోలా రాజేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసిల్దార్ లు ఇక్బాల్, నాగేశ్వరరావు టి ఎం సి రమేష్, మెప్మా సీఈవోలు తదితరులు పాల్గొన్నారు

# హార్దిక్ మాత్రమే ఓవర్లో ఆరు సిక్స్‌లు కొట్టగలిగేది



టీ20 క్రికెట్ లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మొదటి తరం ఆటగాళ్లలో బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్ ఒకడు. 2007లో జరిగిన తొలి టీ-20 ప్రపంచకప్ లో యువరాజ్ ఒక ఓవర్‌లో 36 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అప్పటి నుండి, ఎవరూ ఈ ఫీట్‌ను పునరావృతం చేయలేకపోయారు. 2007 ప్రపంచకప్ లో భారత్ గెలవడానికి యువరాజ్ తనవంతు సహాయం చేశాడు. ఇకపోతే, టీ20 ప్రపంచ కప్ జూన్ 1 నుండి వెస్టిండీస్, యూఎస్ఏ లో జరుగుతుంది. ప్రపంచకప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా యువరాజ్ సింగ్‌ను ఐసీసీ నియమించింది. కాగా, టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు పాల్గొనడంపై ఇప్పటికే పలువురు మాజీ ఆటగాళ్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. తాజాగా యూవి కూడా తన మనసులోని మాటను బయటపెట్టాడు. "ఈ ప్రపంచకప్‌లో ఓవర్‌లో 6 సిక్సర్లు ఎవరు కొట్టగలరు..?" అని ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైన యువీని ప్రశ్నించారు. దానికి యువీ బదులిస్తూ.., "హార్దిక్ పాండ్యాకు ఆ సామర్థ్యం ఉందని నేను భావిస్తున్నాను" అని తెలిపాడు. హార్దిక్ ప్రపంచకప్ జట్టులో ఉండగలడా..? లేదా..? అనే అనుమానం ఉన్న సమయలో ఇప్పుడు యువీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఎటాకింగ్ ఆటను ఆస్వాదించిన దినేష్ కార్తీక్ ఎంపికపై యువీ స్పందించాడు. కార్తీక్ ను ఎంచుకునే ముందు మీరు ఆలోచించాలి. తుది జట్టులో స్థానం ఉంటేనే అతడిని తీసుకోవాలమీ., ఒకవేళ కార్తీక్ ను డగౌట్‌కే పరిమితం చేసేలా ఉంటే., అతన్ని తీసుకెళ్లకూడదని తెలిపాడు. అతని స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకుంటే అతనికి అనుభవం వస్తుందని యువీ అన్నాడు.

# ఉత్కంఠ పోరులో ముంబైపై నెగ్గిన ఢిల్లీ



శనివారం న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఐపీఎల్ 2024 మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ తలపడ్డాయి. మ్యాచ్లో భాగంగా టాస్ ముంబై ఇండియన్స్ గెలవగా ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ కు ఆహ్వానించింది. బ్యాటింగ్ మొదలుపెట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ మొదట్లో విర విహారాన్ని సృష్టించింది. చివరకి ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ లో ఉత్కంఠ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 10 పరుగులతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన నిర్ణిత 20 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్లు కోల్పోయి 257 పరుగులను సాధించింది. ఢిల్లీ ఇన్నింగ్స్ లో ఓపెనర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ తనదైన స్టైల్ లో 27 బంతులతో 11 ఫోర్లు, 6 సిక్సర్ల సహాయంతో 84 పరుగులతో వీరవిహారం చేసాడు. మరో ఓపెనర్ కూడా అభిషేక్ 27 బంతులతో 36 పరుగులు జోడించడంతో డెలిహి భారీ స్కోరును సాధించింది. ఇక భారీ లక్ష్యం చేయడంలో ముంబై ఇండియన్స్ మొదటలో తడబడిన ఆ తర్వాత టార్గెట్ వైపు దూసుకువెళ్లింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా కీలక ఇన్నింగ్స్ ఆడిన చివరికి మ్యాచ్ ఢిల్లీ గెలిచింది. చివరిలో టిమ్ డేవిడ్ తన చివరి ప్రయత్నంగా బౌండరీలు బాదిన ముంబై ఇండియన్స్ టార్గెట్ దగ్గరకు వెళ్ళింది కానీ.. విజయాన్ని అందుకోలేకపోయింది. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ లో ముఖేష్ కుమార్ 3 వికెట్లు, రషీక్ సలాం 3 వికెట్లు, ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు తీయడంతో విజయం ఢిల్లీకి దక్కింది.

# చిన్న పొరపాటుతో రూ. 20లక్షలకు కొన్నారు

ఐపీఎల్ 2024 42వ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంత మైదానం ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 48 బంతుల్లో 108 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడిన ఓపెనర్ జానీ బెయిర్‌స్టో పంజాబ్ కింగ్స్ విజయానికి హీరోగా నిలిచింది. అయితే, అతనికి శశాంక్ సింగ్ నుంచి పూర్తి మద్దతు లభించింది. శశాంక్ సింగ్ కేవలం 28 బంతుల్లో 242.86 స్ట్రైక్ రేట్‌తో 68 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో వరుసగా బౌండరీలు బాదాడు. ఈ ఇన్నింగ్స్‌లో శశాంక్ 2 ఫోర్లు, 8 అద్భుతమైన సిక్సర్లు బాదాడు. పంజాబ్ కింగ్స్‌కు శశాంక్ ఎక్స్ ఫ్యాక్టర్ అని నిరూపిస్తున్నాడు. అయితే, పంజాబ్ కింగ్స్ అతనిని కొనుగోలు చేయాలని అనుకోలేదంట. కానీ వేలంలో జరిగిన చిన్న పొరపాటు కారణంగా అతను ప్రస్తుతం %ూదీఖూ%లో భాగమయ్యాడు. శశాంక్ అద్భుత ప్రదర్శన కారణంగా పంజాబ్ కింగ్స్ 262 పరుగుల స్కోరును ఛేదించి ప్రపంచ రికార్డు సృష్టించగలిగింది. శశాంక్ తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో విధ్వంసం సృష్టించేందుకు డగౌట్‌లోనే ప్లాన్ వేసినట్లు వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం శశాంక్ సింగ్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించాడు. డగౌట్ నుంచి వికెట్‌ను పరిశీలించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నానని తెలిపాడు. ఈ క్రమంలో పిచ్‌ని అర్థం చేసుకుని, అది మంచి బౌన్స్‌గా ఉందని భావించానని, ఆమేరకు నా ప్లాన్ వేసుకున్నాను అంటూ చెప్పుకొచ్చాడు. సునీల్ నరైన్ బౌలింగ్‌ను జాగ్రత్తగా ఆడాలని, మిగిలిన బౌలర్లపై దూకుడుగా ఉండాలని నిర్ణయించుకున్నానని శశాంక్ చెప్పాడు. పంజాబ్ కింగ్స్ తరపున బ్యాటింగ్ చేయడానికి, స్వేచ్ఛగా షాట్లు ఆడేందుకు తనకు పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపాడు. ఐపీఎల్ 2024 వేలంలో పంజాబ్ కింగ్స్ శశాంక్ సింగ్‌ను అనుకోకుండా కొనుగోలు చేసింది. వేరొకరికి బదులుగా రూ. 20 లక్షలకు జట్టులో చేర్చుకుంది. ప్రస్తుతం ఈ యంగ్ ప్లేయర్ జట్టును ఆదుకుంటూ.. తనను అనుకోకుండా కొనుగోలు చేసినందుకు తగిన ప్రతిఫలం అందిస్తున్నాడు. 65.7 యావరేజ్‌తో 180పైగా స్ట్రైక్‌రేట్‌తో ఇప్పటి వరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 263 పరుగులు చేశాడు. ఇందులో 18 సిక్సులు, 19 ఫోర్లు ఉన్నాయి. కాగా, ఏప్రిల్ 5న గుజరాత్ జెయింట్స్‌పై కేవలం 29 బంతుల్లోనే 61 పరుగులతో నాటౌట్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న శశాంక్.. నిన్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 28 బంతుల్లోనే 68 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్రస్తుతం పంజాబ్ జట్టుకు హీరోగా మారాడు. ఇదే ప్రదర్శనతో రాణించి, త్వరలోనే టీమిండియాకు అరంగేట్రం చేయాలని నెటిజన్లు కోరుకుంటున్నారు.

# ఆరల్డ్ ఆర్చరీలో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించిన జ్యోతి సురేఖ

షాంఘై నగరంలో వరల్డ్ ఆర్చరీలో విజయవాడకు చెందిన ఆర్చర్ జ్యోతి సురేఖ హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించింది. జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 1 ఈవెంట్ లో భారత్ కు ఆధిపత్యాన్ని తీసుకొచ్చింది. జ్యోతి సురేఖ.. తన వ్యక్తిగత, ఉమెన్స్ కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్ లో భాగంగా తాను స్వర్ణ పతకాలను గెలిచింది. ద

ఇక వరల్డ్ ఆర్చరీ ఈవెంట్స్ లో వెన్నం జ్యోతి సురేఖ హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించింది. షాంఘై నగరంలో వరల్డ్ ఆర్చరీలో విజయవాడకు చెందిన ఆర్చర్ జ్యోతి సురేఖ హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించింది. జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 1 ఈవెంట్ లో భారత్ కు ఆధిపత్యాన్ని తీసుకొచ్చింది. జ్యోతి సురేఖ.. తన వ్యక్తిగత, ఉమెన్స్ కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్ లో భాగంగా తాను స్వర్ణ పతకాలను గెలిచింది. ఇక వరల్డ్ ఆర్చరీ ఈవెంట్స్ లో వెన్నం జ్యోతి సురేఖ హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించింది. ప్రపంచ పోటీల్లో దీపా కుమారి తర్వాత ఒక వరల్డ్ కప్ స్టేజ్‌లో 3 గోల్డ్ మెడల్స్ సాధించిన రెండవ భారతీయ ఆర్చర్ గా జ్యోతి సురేఖ నిలిచింది. ఇదే టోర్నీలో తన వ్యక్తిగత పోటీతోపాటు కాంపౌండ్ మిక్స్‌డ్, ఉమెన్స్ కాంపౌండ్ టీమ్ కేటగిరీల్లోనూ సురేఖ బంగారు పథకాలను గెలుచుకుంది. ఇక ట్రెబుల్ కేటగిరీలో గెలిచిన కాంపౌండ్ ఫిమేల్ ఆర్చర్ గా మూడవ వ్యక్తిగా కూడా సురేఖ నిలిచారు. ఈ కేటగిరీలలో ఇప్పటివరకు 2016లో సారా లోపేజ్, 2017 లో సారా సోనిచన్ ఈ కూడా అవార్డులను గెలుచుకున్నారు.

# హార్దిక్ చెత్త బౌలింగ్..

ఐపీఎల్ 17వ సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న 42వ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఈ అవకాశాన్ని ఢిల్లీ పూర్తిగా సద్వినియోగం చేసుకుని శుభారంభం చేసింది. ఓపెనింగ్ జోడీ అభిషేక్ పోరెల్, జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ ముంబై బౌలర్ల పై విరుచుకు పడ్డారు.

నాలుగో ఓవర్‌లో జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ హాఫ్ సెంచరీ సాధించాడు. అలాగే ఓపెనింగ్ జోడీ మెక్‌గుర్క్, పోరెల్ 7.3 ఓవర్లలోనే సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మొత్తానికి పోరెల్-మెక్‌గర్క్ 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఢిల్లీ జట్టుకు మంచి శుభారంభం అందించారు. జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ ముంబై నంబర్ 1 బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను సైతం విడిచిపెట్టలేదు. ఇక ఢిల్లీ ఓపెనర్ల ధాటికి హార్దిక్ పాండ్యా కూడా డీలా పడిపోయాడు. ఈ స్టార్ ఆల్ రౌండర్ కేవలం 2 ఓవర్లలోనే 41 పరుగులు ఇచ్చాడు. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇన్నింగ్స్‌లో ఐదు, ఏడో ఓవర్లను పాండ్యా వేశాడు. పాండ్యా ఐదో ఓవర్‌లో 20 పరుగులు, ఏడో ఓవర్‌లో 21 పరుగులు చేశాడు. మొత్తం 2 ఓవర్లలో 20.50 ఎకానమీ రేటుతో పాండ్యా 41 పరుగులు సమర్పించుకున్నాడు హార్దిక్. దీంతో అతనిపై సోషల్ మీడియాలో ట్రోల్ జరుగుతోంది. హార్దిక్ వేసిన ఐదో ఓవర్లో జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ 2 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. ఆ తర్వాత అభిషేక్ పోరెల్ ఏడో ఓవర్ తొలి 5 బంతుల్లో 4, 6, 5 పరుగులు చేశాడు. జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ చివరి బంతికి సిక్సర్ బాదాడు. దీంతో ఏడో ఓవర్లో హార్దిక్ 21 పరుగులు ఇచ్చాడు.

# త్వరలో ఫ్లిప్‌కార్ట్ బిగ్ సేవింగ్ డేస్ సేల్.. ఏ రోజు నుంచి అంటే..?




ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ బిగ్ సేవింగ్ డేస్ సేల్ తేదీలను ప్రకటించింది. మే 3 నుంచి 9 వరకు ఈ సేల్ కొనసాగనుంది. సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్‌లు లభించనున్నాయి. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ మెంబర్‌షిప్ యూజర్లు ఒక రోజు ముందుగానే అంటే మే 2 నుంచే ఈ సేల్‌లో పాల్గొనవచ్చని ప్రకటించింది. అదేవిధంగా బిగ్ సేవింగ్ డేస్ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ కార్డు ద్వారా చేసే కొనుగోళ్లపై 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందించనున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ పే లేటర్ ఆప్షన్ ద్వారా లక్ష రూపాయల వరకు కొనుగోలు చేయొచ్చని, వీటిపై నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం ఉంటుందని ప్రకటించింది. అంతేగాక ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై 5 శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నట్లు తెలిపింది. యూపీఐ లావాదేవీలపై కూడా తగ్గింపు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అయితే కంపెనీ ఆఫర్లను వివరంగా రివీల్ చేయలేదు. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లపై భారీ ఎత్తున డిస్కౌంట్లు అందిచనున్నట్లు సమాచారం.

# టెలిగ్రామ్ డౌన్..! సోషల్ మీడియాలో వెల్లువెత్తిన మీమ్స్..!



ప్రముఖ సోషల్ మీడియా మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ టెలిగ్రామ్ సేవలు నిలిచిపోయాయి. మెసేజ్‌లను పంపడం, డౌన్‌లోడ్, లాగిన్ యూజర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 6700 మందికిపై టెలిగ్రామ్ పని చేయడం లేదని ఫిర్యాదులు చేసినట్లుగా డౌన్‌డిటెక్టర్ వైబ్‌సైట్ తెలిపింది. ఇందులో 30శాతం యాప్ సంబంధించిన సమస్యలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, లక్నో, పాట్నా, జైపూర్, అహ్మదాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లోకి వెళ్లిన తర్వాత కనెక్ట్ చేయడంలో సమస్యలు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. చాలా మంది యాప్‌ని అన్ ఇన్‌స్టాల్ చేసి.. రీ ఇన్‌స్టాల్ చేసినట్లు ఓ నివేదిక పేర్కొంది. భారత్‌తో పాటు ఆసియా, ఐరోపాలోని పలుచోట్ల సైతం టెలిగ్రామ్ సేవలు ప్రభావితమైనట్లుగా నివేదిక పేర్కొంది. ఇప్పటి వరకు దీనిపై టెలిగ్రామ్ స్పందించలేదు. టెలిగ్రామ్ డౌన్ కావడంతో ఎక్స్ (ట్విట్టర్)లో మీమ్స్ వెల్లువెత్తాయి.

# గూగుల్‌తో 20 ఏళ్ల బంధం..

## ఎమోషనల్ పోస్ట్ చేసిన సుందర్ పిచాయ్




ప్రముఖ సెర్చింజన్ గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సంస్థలో చేరి 20 ఏళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా గూగుల్‌తో తనకున్న బంధంపై ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 2004లో సంస్థలో ప్రాడక్ట్ మేనేజర్‌గా చేరినప్పటి నుంచి నేటి వరకూ గూగుల్‌లో తన ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ ఇన్‌స్టాలో పోస్టు షేర్ చేసుకున్నారు. ఉద్యోగంలో చేరిన తొలినాళ్ల నుంచి నేటి వరకు సంస్థలో ఎన్నో మార్పులు జరిగినట్లు చెప్పుకొచ్చారు. '2004 ఏప్రిల్ 26న గూగుల్‌లో నా తొలి రోజు ప్రారంభమైంది. ప్రాడక్ట్ మేనేజర్‌గా నా ప్రయాణాన్ని ప్రారంభించాను. అప్పటి నుండి ఇప్పటి వరకూ సంస్థలో చాలా మార్పులు జరిగాయి. సాంకేతికత, మా ఉత్పత్తులను ఉపయోగించే ప్రజల సంఖ్య.. ఇలా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. నా జుట్టు కూడా. కానీ, ఈ గొప్ప సంస్థలో పని చేస్తుంటే నాకు కలిగే ఉత్సాహం మాత్రం మారలేదు. 20 ఏళ్లు గడిచిపోయాయి. ఇందులో భాగమైనందుకు ఇప్పటికీ నన్ను నేను అదృష్టవంతుడిగా భావిస్తున్నాను' అని సుందర్ పిచాయ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థ నుంచి తనకు అందిన తీపి గుర్తులను షేర్ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది.ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన సుందర్ పిచాయ్.. 2004లో గూగుల్‌లోకి అడుగుపెట్టారు. ఓ సాధారణ ఉద్యోగిగా గూగుల్‌లోకి అడుగుపెట్టిన ఆయన సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. అంచెలంచలుగా ఎదుగుతూ.. సీఈవో పదవికి చేపట్టారు. గూగుల్ క్రోమ్, ఆండ్రాయిడ్, గూగుల్ డ్రైవ్ వంటి గొప్ప గొప్ప ఆవిష్కరణలన్నీ ఆయన ఆలోచనల నుంచి పుట్టకొచ్చినవే. ఆ కష్టానికి ప్రతిఫలంగా 2015లో ఆయనకు సీఈవో పదవి దక్కింది.

# ఫారెక్స్ రిజర్వులు డౌన్..

## వరుసగా రెండోవారం 2 బిలియన్ డాలర్లు తగ్గిన నిల్వలు



ముంబై, ఏప్రిల్ 26: విదేశీ మారకం నిల్వలు మరింత పడిపోయాయి. వరుసగా రెండోవారం ఈ నెల 19తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.282 బిలియన్ డాలర్లు కరిగిపోయి 640.334 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 5.401 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ నెల 5తో ముగిసిన వారంలో రిజర్వులు రికార్డు స్థాయి 648.562 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతకుముందు సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయి 642.453 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ మారకం నిల్వలు మళ్లీ నాలుగేండ్ల తర్వాత ఈ గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. మరోవైపు, పసిడి రిజర్వులు 1.01 బిలియన్ డాలర్లు ఎగబాకి 56.808 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డీఆర్) 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.034 బిలియన్ డాలర్లకు, అలాగే ఐఎంఎఫ్ వద్ద నిల్వలు కూడా 2 మిలియన్ డాలర్లు తగ్గి 4.631 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

# పుష్పలో ముందు సుహాస్‌ను అనుకున్నా

## మనసులో మాట చెప్పిన సుకుమార్






అల్లు అర్జున్ హీరోగా తాను తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ మూవీ 'పుష్ప' లోని ఫ్రెండ్ క్యారెక్టర్‌కు ముందుగా సుహాస్‌ని అనుకున్నామని దర్శకుడు సుకుమార్ తెలిపారు. 'ప్రసన్నవదనం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై, ఈ ఆసక్తికర విషయం పంచుకున్నారు. సుహాస్ హీరోగా అర్జున్ వై.కె. తెరకెక్కించిన చిత్రమిది. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ హీరోయిన్లు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో ఈవెంట్‌ను శుక్రవారం నిర్వహించింది. సతీసమేతంగా సుకుమార్, మరో దర్శకుడు బుచ్చిబాబు హాజరయ్యారు. 'సుహాస్.. నువ్వంటే నాకు, అల్లు అర్జున్‌కు ఇష్టం. నీ ఎదుగుదల చూస్తున్నాం. 'పుష్ప'లోని హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కేశవగా ముందు నిన్నే అనుకున్నాం. కానీ, అప్పటికే హీరోగా చేస్తున్న నిన్ను ఆ రోల్‌కి ఎంపిక చేయడం బాగోదనిపించింది. నాని నటన నాకు బాగా ఇష్టం. సుహాస్.. ఫ్యూచర్ నానిలా అనిపిస్తున్నాడు. సహజ నటుడు నాని కాబట్టి సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంతగా ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. ఈ సినిమాలో రాశీసింగ్, పాయల్ రాధాకృష్ణ చక్కగా నటించారు' అని ప్రశంసించారు. తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అర్జున్ గురించి మాట్లాడుతూ..నేను 'జగడం' సినిమా రూపొందిస్తున్న సమయంలో అర్జున్ నన్ను కలిశాడు. 'మీ 'ఆర్య' చిత్రం నాకు బాగా నచ్చింది సర్. మీ వద్ద పని చేయాలనుకుంటున్నా' అని అన్నాడు. టీమ్‌లో జాయిన్ చేసుకున్నా. చాలా అమాయకుడు. కానీ, లాజిక్ ఉన్నవాడు. అర్జున్, మరో అసిస్టెంట్ తోట శ్రీనుతో కలిసి 23 రోజుల్లో '100శాతం లవ్' స్టోరీ రాశా. అప్పటి నుంచి నా ప్రతి సినిమాకి వీరిద్దరు పనిచేశారు. వీళ్లతో పాటు ఒక్కో చిత్రానికి ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఉండేవారు. అర్జున్ బిజీగా ఉండడంతో నేను లాజిక్ ఉన్న సినిమాలను మానేశా. అర్జున్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. థియేటర్‌కు వెళ్లి సిని మా చూడండి..నా అర్జున్‌ని సపోర్ట్ చేయండి' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.

# హాలీవుడ్‌లోనూ అవే కష్టాలు: ప్రియాంక

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే హాలీవుడ్‌లో స్థిరపడ్డారు ప్రియాంక చోప్రా. అక్కడకు వెళ్లిన తొలినాళ్లలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. అక్కడి వారెవరూ కనీస గౌరవం ఇవ్వలేదన్నారు. 'భారత్‌లో ఉన్నప్పుడు హాలీవుడ్ ప్రముఖ మ్యాగజైన్‌ల కవర్‌పై నా ఫొటో ఆరుసార్లు వచ్చింది. విదేశాలకు వచ్చాక ఎవ్వరూ కనీసం నాతో ఒక మీటింగ్ కూడా నిర్వహించలేదు. ఎన్నో ఎదురుదెబ్బలు, తిరస్కరణలు అనుభవించాను. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మౌనంగా నాపని నేను చేశాను. అదే ఈరోజు హాలీవుడ్‌లోనూ నాకు గుర్తింపు రావడానికి కారణమైంది. భారత్ నుంచి ఇక్కడకు రాగానే ఎంతో భయపడ్డాను. నాకు తెలియని పరిశ్రమ, పలకరించేవారు ఎవ్వరూ లేరు. ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న భావన మనసును కుంగదీసేది. అయినా ధైర్యంగా ముందుకు సాగాను' అని చెప్పారు. గతంలో ప్రియాంక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాలీవుడ్ లోని రాజకీయాలకు విసిగిపోవడం వల్లే హాలీవుడ్ లో స్థిరపడ్డాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'హిందీ చలన చిత్ర పరిశ్రమలో నన్ను ఓ మూలకు తోసేశారు. ఎవరూ నాకు అవకాశాలు ఇవ్వట్లేదు. పలువురితో విభేదాలు ఏర్పడ్డాయి. అక్కడ రాజకీయాలు ఉంటాయి. వాటితో నేను విసిగిపోయా. అందుకే బాలీవుడ్ నుంచి బ్రేక్ తీసుకోవాలనిపించింది. అలా అమెరికా వచ్చేశా' అని చెప్పారు. ఇటీవల తన భర్తతో కలిసి 'లవ్ అగైన్' తో అలరించిన ప్రియాంక.. 'హెడ్ ఆఫ్ స్టేట్' అనే యాక్షన్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే త్వరలో విడుదల కానున్న 'టైగర్' అనే డాక్యుమెంటరీలో అంబా అనే ఆడపులి పాత్రకు తన గొంతు అందిస్తున్నారు.




# ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం అన్న సమంత



స్టార్ హీరోయిన్ సమంత తాజాగా తన అభిమానుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం చిన్న విషయం కాదని చెప్పుకొచ్చింది. తన మాటను గౌరవించే అభిమానులు ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపింది. ఇక తన అభిమానుల్లో చాలామందికి వినోదం, ఫ్యాషన్, మేకప్‌పై ఆసక్తి ఎక్కువ ఉంటుందని పేర్కొంది. వారిని చూసి ఎన్నో విషయాలపై తన అభిప్రాయాన్ని మార్చుకున్నానని, కొత్త అంశాలపై అవగాహన వచ్చినట్లు తెలిపింది. తన మాటలు కొద్దిమందిపై ప్రభావం చూపినా తనకు ఆనందమేనని పేర్కొంది. వీటి ద్వారా కొంతమంది లో అయినా మార్పు తీసుకురాగలిగితే అంతకు మించి తానేం కోరుకోను అంటూ చెప్పుకొచ్చింది. ఇక తన మనసుకు నచ్చిందే చేస్తానని సమంత ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఏ నిర్ణయం తీసుకున్నా అది సరైనదా.. కాదా, అని ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తానని తెలిపింది. మానసికంగా ప్రశాంతంగా లేకపోతే శారీరకంగా కూడా ఫిట్‌గా ఉండలేదని పేర్కొంది. అందుకే తానెప్పుడూ మెంటల్ హెల్త్‌కు ప్రాధాన్యత నిస్తానని వెల్లడించింది. అందుకోసం అవసరమైన వ్యాయామాలు కూడా చేస్తుంటానని వివరించింది.

# ఓటీటీలోకి వస్తున్న 'మంజుమ్మల్ బాయ్స్'





మలయాళ చిత్రసీమలో సంచలనం సృష్టించిన చిత్రం 'మంజుమ్మల్ బాయ్స్' ఇటీవల విడుదలైన ఈ థ్రిల్లర్ తెలుగులోనూ మంచి టాక్ తెచ్చుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అయింది. డిస్నీ హాట్‌స్టార్ వేదికగా మే5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 2006లో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని దర్శకుడు చిదంబరం ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సౌబిన్ షహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్‌భాసి, షా జార్జ్ మరియన్, లాల్ జూనియర్ కీలక పాత్రల్లో నటించారు.కేరళలోని కొచ్చికి చెందిన కుట్టన్ , స్ఖుభాష్ (శ్రీనాథ్)తో పాటు ?స్నహితులందరూ సొంత ఊళ్లోనే చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ గ్యాంగ్‌కు మంజుమ్మల్ బాయ్స్ పేరుతో ఓ అసోసియేషన్ ఉంటుంది. వీరంతా కలిసి ఓసారి కొడైకెనాల్ టూర్‌కు వెళ్లారు. ఈ విహారయాత్రకు సుభాష్ మొదట రానని చెప్పినా కుట్టన్ బలవంతం మీద ఆఖరి నిమిషంలో కార్ ఎక్కుతాడు. మంజుమ్మల్ బ్యాచ్ కొడైకెనాల్‌లోని అందమైన ప్రదేశాలన్నీ చూశాక ఆఖరిలో గుణ కేవ్స్ చూడటానికి వెళ్తారు. ఆ గుహలు బయట నుంచి చూడటానికి ఎంత రమణీయంగా ఉంటాయో.. అంతే ప్రమాదకరం కూడా. ఎందుకంటే అక్కడ వందల అడుగుల లోతున్న ఎన్నో ప్రమాదకరమైన లోయలున్నాయి. వాటిలో డెవిల్స్ కిచెన్ కూడా ఒకటి. దాదాపు 150 అడుగులకు పైగా లోతున్న ఆ లోయలో 13మందికి పైగా పడిపోయారు.. వీరిలో ఏ ఒక్కరూ ప్రాణాలతో తిరిగిరాలేదు.

అందుకే గుణ కేవ్స్‌లోని ఆ ప్రమాదకర లోయలున్న ప్రాంతాలున్న చోటుకు వెళ్లడాన్ని అటవీశాఖ వారు.. పోలీసులు నిషేధించారు. కానీ, మంజుమ్మల్ బాయ్స్ అక్కడున్న అటవీ సిబ్బంది కళు ్లగప్పి.. ఫెన్సింగ్ దాటి గుణ కేవ్స్‌లోని ఆ ప్రమాదకరమైన ప్రదేశానికి వెళ్తారు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ లోయ నుంచి సుభాష్‌ను ప్రాణాలతో కాపాడి తీసుకురావడానికి తోటి స్నేహితులంతా ఏం చేశారు? అన్నది ఈ సినిమా ఇతివృత్తం.

# అగ్రనటుల పారితోషకంపై చర్చ

## అభిమాన సంఘాల మధ్య పెరిగిన పోటీ



అగ్ర నటుల అభిమానులు వారి నటులపై వున్న అభిమానంతో వాగ్యుద్ధం చేసుకోవటం కొత్తేమీ కాదు కానీ, ఈ సామాజిక మాధ్యమం వచ్చాక మరీ ఎక్కువయిపోయాయి. ఈ అభిమానుల వార్స్ అనేవి ఒక్కోసారి ఒక్కో రకంగా రూపాంతరం చెందుతూ ఉంటాయి. అప్పట్లో అగ్ర నటుల అభిమానుల మధ్య ఎప్పటికప్పుడు మాటల యుద్ధం నడుస్తూ వచ్చేది. ఇప్పుడైతే అది ముదిరి మొదటిరోజు ఓపెనింగ్స్ వరకు వచ్చేసింది. అది కూడా దాటిపోయి ఇప్పుడు ఇంకో కొత్త కోణంలో ఈ అభిమానుల మధ్య వార్ మొదలయ్యింది. అదేంటి అంటే, అభిమానుల మధ్య వినిపిస్తున్న ప్రధాన పోటీ తమ అభిమాన నటుల పారితోషికం గురించి. ఇప్పుడు ప్రతి అగ్ర నటుడు తమ సినిమా ఒక్క భాషలో కాకుండా మొత్తం ఇండియా అంతా విడుదల చెయ్యాలని దానికి తగ్గట్టుగా పారితోషికాలు కూడా తీసుకుంటున్నారు. అలా చాలామంది నటుల మార్కెట్ కూడా బాగా విస్తరించింది కూడా. దానికి తగ్గట్టుగా ఆయా నటుల పారితోషికాలు కూడా బాగా పెరిగిపోయాయి. దక్షిణాదిలోనే ఇలా చాలామంది అగ్ర నటులకి అభిమాన సంఘాలు ఉండటం, వాళ్ళు తమ నటుడి గురించి సామాజిక మాధ్యమంలో మాట్లాడటం జరుగుతూ ఉంటుంది. ఇలా పారితోషికాలు విషయంలో తమిళ సూపర్ స్టార్స్ రజనీకాంత్, విజయ్ అభిమానుల మధ్య సామాజిక మాధ్యమంలో విపరీతంగా వాగ్యుద్ధం జరుగుతోంది. తెలుగు నటుడు ప్రభాస్ పారితోషికంగా రూ.150 కోట్లు తీసుకుంటూ దక్షిణాదిలో ఎక్కువ పారితోషికం తీసుకున్న నటుడిగా ఉండేవారు అనేవారు. అలాగే తమిళ సూపర్ స్టార్ విజయ్ కు 'వారసుడు' సినిమాకి గాను రూ.120 కోట్లు ఇచ్చారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా విజయ్ పారితోషికం ఒక్కసారిగా పెరిగిపోయింది అని, తాను చెయ్యబోయే ఆఖరి సినిమాకి అతని పారితోషికం రూ. 250 కోట్ల వరకు ఉందని విజయ్ అభిమానులు చెపుతున్నారు. సినిమాలు మానేసి రాజకీయాల్లో పూర్తిగా కేటాయించడానికి విజయ్ చేయబోయే ఆఖరి సినిమాకు రూ. 250 కోట్ల పారితోషికం అని అభిమానులు చెపుతున్నా, ఈ సినిమాపై ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అసలు ఈ సినిమా ఉంటుందా, ఉండదా, ఉంటే దర్శకుడు ఎవరు అనే విషయంలో కూడా ఇంకా ఏమీ అనుకోలేదు అని తెలిసింది. కానీ విజయ్ కి ఎలివేషన్ ఇచ్చేందుకు అతని అభిమానులు దేశంలోనే అత్యధిక రెమ్యూనిరేషన్ తీసుకుంటున్నది తమ నటుడే అని చెప్పుకుంటున్నారు.

# రామాయణంపై నెటిజన్ల అత్యుత్సాహం




ఆలూలేదు..చూలూ లేదన్న సామెత లాగా ఇప్పుడు రామాయణం సినిమా కథ నడిపించేస్తున్నారు. రణబీర్‌కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రామాయణ' సినిమా షూటింగ్ ఇటీవలే ముంబయిలో మొదలైందన్న విషయం నిర్మాతలకే తెలియదు. కానీ షూటింగ్ ప్రారంభం అయినట్లు సోషల్ మీడియాలో షేక్ చేస్తున్నారు. ఈ చిత్రంలో సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, రావణాసురుడి పాత్రను కన్నడ అగ్ర హీరో యష్ పోషిస్తున్నారు. నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా అంచనాలున్నాయి. ఇదిలావుండగా రావణుడి పాత్ర కోసం యష్ ఇప్పటి నుంచే కసరత్తులు చేస్తున్నట్లు తెలిసింది. కాస్త భారీకాయంతో కనిపించేందుకు ఆయన 20 కిలోల బరువు పెరగాలని నిర్ణయించుకున్నారట. ఇప్పటికే ఈ దిశగా ఆయన ప్రయత్నాలు మొదలు పెట్టారని అంటున్నారు. ప్రస్తుతం యష్ 'టాక్సిక్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాతే ఆయన 'రామాయణ' సెట్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. ప్రస్తుతం ముంబయిలో వేసిన అయోధ్య సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. సాయిపల్లవి జూన్‌లో షూటింగ్‌లో జాయిన్ కానుంది.

# ప్రేమబంధానికి శృతి గుడ్‌బై



అగ్ర కథానాయిక శృతిహాసన్ తన ప్రేమబంధానికి గుడ్‌బై చెప్పిందా? అంటే ఔననే అంటున్నాయి ముంబయి సినీ వర్గాలు. డూడుల్ ఆర్టిస్టు శాంతను హజారికాతో ఈ భామ కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. తన లవ్‌ఫ్గ÷ర్‌పై శృతిహాసన్ బహిరంగంగా ఎప్పుడూ స్పందించనప్పటికీ.. ప్రియుడితో తీయించుకున్న ఫొటోలను తరచుగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేది. ఈ జంట ముంబయిలో సహజీవనం సాగిస్తున్నారనే వార్తలు కూడా వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ జంట విడిపోయినట్లు తెలిసింది. వ్యక్తిగత కారణాల వల్ల విడిపోయారని, పరస్పర అంగీకారంతోనే తమ బంధానికి గుడ్‌బై చెప్పుకున్నారని వార్తలొస్తున్నాయి. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తూ ఈ ప్రేమజంట సోషల్‌మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. 'ఈ ప్రయాణంలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా. ఇతరులనూ అర్థం చేసుకున్నా' అంటూ శృతిహాసన్ పెట్టిన పోస్ట్ కూడా వారి బ్రేకప్‌ను నిర్ధారిస్తున్నదని అమె అభిమానులు అంటున్నారు.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com